teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 364 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 8 మే 2024 | పేజీలు : 08 | వెల ‘ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## ఎంసెట్ పరీక్ష రాసే విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

**రాత్రి 7 గం.లైనా బయటకు రాకపోవడంతో రహదారిపై రాస్తారోకో**



కరీంనగర్, మే 07 (తీన్మార్ న్యూస్): కరీంనగర్ లో ఎంసెట్ ఎగ్జామ్స్ అటు పరీక్ష రాసే విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల్లో ఆందోళనకు కారణమైన సంఘటన మంగళవారం తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో చోటు చేసుకుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు

మిగతా 2 లో

# పడిపోయిన విద్యుత్తు వినియోగం

## రాష్ట్రవ్యాప్తంగా తగ్గిన 2000 మెగావాట్ల వాడకం

## తెలంగాణలో వర్షాలు పడటంతో సగానికి తగ్గిన

**రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో విద్యుత్తు వినియోగం కూడా గణనీయంగా పడిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా 2000 మెగావాట్ల వాడకం తగ్గిపోయింది. సోమవారం ఒక్కరోజే ఖమ్మంలో 315 మెగావాట్ల విద్యుత్తు వాడగా, అదే మంగళవారానికి వచ్చేసరికి కేవలం 55 మెగావాట్లే వినియోగించారు. అంటే దాదాపు 260 మెగావాట్లు డౌన్.**



హైదరాబాద్, మే 07 (తీన్మార్ న్యూస్): అదే వరంగల్లో 476 నుంచి 163, కరీంనగర్ 838 నుంచి 413, ఆదిలాబాద్ 285 నుంచి 82, నిజామాబాద్ 395 నుంచి 208 మెగావాట్లకు విద్యుత్తు వినియోగం పడిపోయింది. ఇలా రాష్ట్రమంతటా విద్యుత్తు వినియోగం తగ్గిపోయింది. సోమవారం వరకు భానుడి భగభగలతో విద్యుత్తు వాడకం అమాంతం పెరిగింది. సోమవారం ఒక్కసారిగా రాష్ట్రంలో వాతావరణం మారిపోయింది. మరీ ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాలు పడటంతో విద్యుత్తు వినియోగం సగానికి సగం తగ్గింది. దక్షిణ తెలంగాణలోనూ వెయ్యి మెగావాట్లకుపైగా డిమాండ్ తగ్గింది. రాబోయే ఐదు రోజులపాటు ఉత్తర తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశమున్నట్టు వాతావరణశాఖ ప్రకటించింది. విద్యుత్తు డిమాండ్ మరింత తగ్గే అవకాశాలున్నాయి. సోమవారం రాష్ట్రంలో 10,847 మెగావాట్లు గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ నమోదు కాగా, మంగళవారం 8,848 మెగావాట్లకు చేరింది. అత్యధిక డిమాండ్ టీఎస్ఎస్పీడీసీఎల్‌లోనే నమోదయ్యింది.



## మే 14 వరకు కవితకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

**వారం రోజుల్లో కవితపై చార్జ్ షీట్‌ను దాఖలు చేస్తామని ఈడీ వెల్లడి**

న్యూ ఢిల్లీ, మే 07 (తీన్మార్ న్యూస్): దేశవ్యాప్తంగా పెనుసంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితఅరెస్ట్ అయిన విషయం తెలిసిందే. రౌస్ అవెన్యూ కోర్టులో మంగళవారం మరోసారి ఈ కేసు విచారణ జరిగింది. ఈడీ, సీబీఐ

మిగతా 2 లో



## కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ పై సుప్రీంకోర్టులో విచారణ

**ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ బెయిల్ పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**

**దర్యాప్తులో జాప్యం ఎందుకని ఈడీని ప్రశ్నించిన సుప్రీం**

న్యూ ఢిల్లీ, మే 07 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ బెయిల్ కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించిన కేసులో అరెస్టయిన కేజ్రీవాల్

మిగతా 2 లో




## రైతు భరోసాపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు

**పోలింగ్ ముగిసిన తర్వాతనే నిధులను పంపిణీ**

**ఈ విషయంలో రేవంత్ రెడ్డి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని పేర్కొన్న ఈసీ**

**రబీ సీజన్ రైతు భరోసా పంపిణీపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. మే 13న పోలింగ్ ముగిసిన తర్వాతనే పెండింగ్ రైతు భరోసా నిధులను పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారని ఈసీ పేర్కొంది. ఈనెల 9వ తేదీలోగా రైతు భరోసా నిధులను పంపిణీ చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఈసీ తప్పుబట్టింది.**

తెలంగాణ బ్యూరో, మే 07 (తీన్మార్ న్యూస్): దీంతో రైతు భరోసా నిధుల పంపిణీని వెంటనే నిలుపుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఐదు ఎకరాల కంటే పైబడిన భూమి ఉన్న రైతులకు రైతు భరోసా నిధులను రేవంత్ రెడ్డి సర్కార్ సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం నుంచే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే ప్రక్రియను మొదలు పెట్టింది. దాదాపు రూ.2 వేల కోట్ల నిధులను విడుదల చేసి పంపిణీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం మొదలు పెట్టింది. అయితే ఈ రైతు భరోసా నిధుల పంపిణీ ప్రక్రియ మూడు రోజుల్లో పూర్తి అవుతుందని అధికారులు భావించారు. వారి

మిగతా 2 లో



## లోక్ సభ ఎన్నికల పోటీ జాతీయ పార్టీల మధ్యే

**ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కుప్పకూలిపోతుంది**

**ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి వాఖ్యలు**

**దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఎన్నికలు జాతీయ పార్టీల మధ్యే పోటీ ఉంటుంది అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ బీజేపీ పార్టీల మధ్యే పోరు కొనసాగనుందన్నారు. ఈ లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కుప్పకూలిపోతుంది. ఇక, పరోక్షంగా భారతీయ జనతా పార్టీని గెలిపించడానికి బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో తెలంగాణలో 14 సీట్లు గెలడమే మా టార్గెట్ అన్నారు.**

తెలంగాణ బ్యూరో, మే 07 (తీన్మార్ న్యూస్): 100 రోజుల పాలనను చూసి తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరుతున్నాం. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు 39. 50 శాతం ఓట్లు వచ్చాయి. ఈ లోక్ సభ ఎన్నికల్లో మా ఓట్ షేర్ పెరిగిన లేదా తగ్గకున్నా మేం పాసైనట్లే, రెఫరెండం అంటే అదీ అని చెప్పుకొచ్చారు. అలాగే, కేవలం 100 రోజుల్లోనే అన్నీ అయిపోవాలంటే ఎలా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇక, ఆర్ఆర్ ట్యాక్స్ అనేవి ఉట్టి గాలి మాటలు నేను ఎవరికీ ఏ కాంట్రాక్టులు ఇవ్వలేదే అని రేవంత్‌రెడ్డి

మిగతా 2 లో

## మూడు రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్ష సూచన

**ఏడు జిల్లాలకి రెయిన్ అలెర్ట్: వాతావరణశాఖ**



హైదరాబాద్, మే 07 (తీన్మార్ న్యూస్): మార్చి నెల నుంచి ఎండలు మండుతున్నాయి. ఏప్రిల్ నుంచి భానుడి ప్రతాపం మరింతగా చూపిస్తున్నాడు. ప్రతిరోజూ అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయంటే ఎండ వేడి ఎంతగా పెరిగిపోయిందో అర్థమవుతుంది. ఉదయం 9 గంటల నుంచే ఎండ మొదలై మధ్యాహ్నం బీభత్సం సృష్టిస్తుంది. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వేసవి తాపం తట్టుకోలేక

మిగతా 2 లో

## తెలంగాణలో మద్యం ప్రియులకు కష్టకాలం




**వేసవికాలంలో భారీగా బీర్ల కొరత..**

**వైన్ షాపులలో దర్శనమిస్తున్న "నో స్టాక్" బోర్డులు**



హైదరాబాద్, మే 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో మద్యం ప్రియులకు కష్టకాలం వచ్చింది. వేసవికాలంలో బీర్ల కొరత ఏర్పడింది. చాలినన్ని బీర్లు దొరక్క మద్యం ప్రియులు అసంతృప్తి చెందుతున్నారు. ఎండలు పెరగడం, ఐపీఎల్, లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో బీర్లకు డిమాండ్ పెరిగింది. డిమాండ్‌కు తగిన సప్లై లేకపోవడంతో చాలా చోట్ల వైన్ షాపులలో నో స్టాక్ బోర్డులు పెడుతున్నారు. ప్రభుత్వమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మద్యంప్రియులు కోరుతున్నారు. అయితే ఇదే అదనుగా చేసుకుని కొందరు కొన్ని చోట్ల అధిక ధరలకు

మిగతా 2 లో

## రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చలేరు

**హెచ్చరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

హైదరాబాద్, మే 07 (తీన్మార్ న్యూస్): ఎవరు ఎన్ని కుట్రలకు పాల్పడినా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చలేరని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని పడగొడతామంటే ప్రజలు చూస్తూ ఉరుకోరని హెచ్చరించారు. మంగళవారం ఆయన

మిగతా 2 లో





## బోధన, బోధనేతర నియామకాల రద్దుపై సుప్రీం సీరియస్

**రద్దుపై కోల్‌కత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే**

**కుంభకోణంపై విచారణకు సీబీఐకి అనుమతినిచ్చిన సుప్రీం**

.. వివరాలు 2లో

## ఐదునెలలుగా "కాంగ్రెస్" దుకాణం కేసీఆర్ ను తిట్టడమే

**కామారెడ్డిలో రేవంత్ పై మండిపడ్డ కేసీఆర్**

**కాంగ్రెస్ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిందంటూ ఆరోపణలు**

కామారెడ్డి, మే 07 (తీన్మార్ న్యూస్): కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆయన రోడ్‌షో నిర్వహించారు. జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో



# మే 14 వరకు కవితకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

## మొదటి పేజీ తరువాయి

కేసుల్లో కవిత జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో కవితను కోర్టులో దర్యాప్తు సంస్థలు హాజరుపరిచాయి. దీంతో మే 14 వరకు కవితకు జ్యుడీషియల్ కస్టడీ పొడగిస్తూ న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. వారం రోజుల్లో కవితపై చార్జ్ షీట్‌ను దాఖలు చేస్తామని కోర్టుకు ఈడీ అధికారులు వెల్లడించారు. కవిత జ్యుడీషియల్ కస్టడీ అంశంపై జడ్జి కావేరి బవేజా విచారణ జరుపుతున్నారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిని కోర్టుకు వివరించి కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని ఈడీ, సీబీఐ అధికారులు కోరారు. లిక్కర్ పాలసీ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని సీబీఐ, ఈడీ అధికారులు కోరారు. జైలులో కవితకు 10 పుస్తకాలు అనుమతించాలని కోర్టును కవిత న్యాయవాది నితీష్ రానా కోరారు. కోర్టులో కవితను 15 నిముషాల పాటు కలిసేందుకు కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని కోర్టును కవిత న్యాయవాది కోరారు. కోర్టు లాకప్‌లో కవితకు తన భర్త తెచ్చిన ఆహారం తినేందుకు అనుమతించాలని కోర్టును నితీష్ రాణా కోరారు. జైలులో కవితకు ఇచ్చే ఇంటి భోజనం 10-15 మంది పోలీసులు చెక్ చేసిన తర్వాత పాడు చేసిన ఆహారాన్ని అందిస్తున్నారని అలా కాకుండా డాక్టర్ జైలు అధికారి చెక్ చేసి కవితకు అందించాలని కోర్టును కవిత న్యాయవాది కోరారు. కవిత ఇంటి భోజనం వద్దన్న తర్వాత మళ్లీ ఎందుకు అడుగుతున్నారని జడ్జి ప్రశ్నించారు. కవితకు ఇంటి భోజనం అందించే అంశంపై జైలు సూపరింటెండెంట్‌ను వివరణ కోరతామని జడ్జి అన్నారు.

# తెలంగాణలో మద్యం ప్రియులకు కష్టకాలం

## మొదటి పేజీ తరువాయి

అమ్ముతున్నారని వాపోతున్నారు. ఎండకాలం చల్లని బీరు తాగేందుకు మద్యం ప్రియులు ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. దానికి తోడు ఐపీఎల్ రావడంతో మధ్యాహ్నం నుంచే మ్యాచ్‌లు వీక్షిస్తూ బీర్లు సేవిస్తున్నారు. అలాగే రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఏకంగా 46 డిగ్రీలు దాటడంతో బీర్లకు డిమాండ్ పెరుగుతోంది. అయితే వైన్స్‌లలో సరిపడా బీర్లు అందుబాటులో ఉండడం లేదు. దీంతో నిర్వాహకులు నో స్టాక్ బోర్డులు పెడుతున్నారు. స్టాక్ వచ్చిన రెండు గంటల్లోనే బీర్లన్నీ అమ్ముడుపోతున్నాయి. చల్లగా లేకపోయినా కొనుక్కుని వెళ్తున్నారంటే ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. బీర్లు సరిపడ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలంటూ ఎక్సైజ్ శాఖ కమిషనర్‌ను కలిశారు వైన్స్ షాప్ ఓనర్స్. రోజుకు ఒక్క వైన్స్ లో కనీసం 1200 నుంచి 1500 ల బీర్లు సేల్ చేస్తామని కానీ తమకు ఎక్సైజ్ డిపో నుంచి కేవలం 200 నుంచి 240 బీర్లు మాత్రమే పంపుతున్నారని కమిషనర్ కు తెలిపారు. వైన్స్‌ల వద్ద కస్టమర్లు బీర్లు కావాలని అడుతున్నారని కానీ బీర్లు లేక నో స్టాక్ బోర్డ్‌లు పెడుతున్నామని వివరించారు. హైదరాబాద్‌లో ఏడాదికి ఒక్కో వైన్స్ షాప్ కు కోటి 10 లక్షల రూపాయల లైసెన్స్ ఫీజు కడుతున్నామని తెలిపారు. లైసెన్స్ ఫీజు కట్టి కూడా తాము లాస్ అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బీర్లు ఎక్కువగా సేల్ అయ్యేది ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే,జూన్ నెలలోనే కానీ ఈ టైం లో ఎక్సైజ్ శాఖ సరిపడ సప్లై చేయడం లేదంటూ చెప్పారు. డిమాండ్ ఉన్నప్పుడే బీర్లను అమ్మలేకపోతున్నామని కమిషనర్ కు వెల్లడించారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చలేరు

## మొదటి పేజీ తరువాయి

గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బీజేపీకి అవకాశం దొరికితే రిజర్వేషన్లు మార్చడానికి కుట్ర చేస్తుందని వెల్లడించారు. బీజేపీ అసలు ఎజెండా కులాల రిజర్వేషన్లు రద్దు చేయడమే అని వ్యాఖ్యానించారు. ఇందుకు కేసీఆర్ బీజేపీకి వత్తాసు పలకడం సిగ్గు చేటు అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి రిజర్వేషన్ల రద్దుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. 2/3 మెజారిటీతో రాజ్యాంగాన్ని మార్చి సెక్యులర్ పదాన్ని తొలగించాలని చూస్తున్నారన్నారు. దీన్ని దేశ వ్యాప్తంగా ప్రజలంతా గమనించాలన్నారు. బీజేపీ పవర్ లోకి రాకుండా చేసే బాధ్యత ఎస్సీ, ఎస్టీ, బీసీలదే అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు కలిసి పోయి కాంగ్రెస్ ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నాయన్నారు. చిన్నాభిన్నం చేసిన రాష్ట్రాన్ని 3 నెలల్లోనే చక్క దిద్దామన్నారు. దీన్ని జీర్ణించుకోలేని ఆ రెండు పార్టీలు కాంగ్రెస్ ను భయపెట్టాలని చూస్తున్నాయన్నారు. వాస్తవాలు ప్రజలకు చెప్పితే సీఎం ను భయపెట్టాలని చూస్తున్నారన్నారు. హిట్లర్, ముస్సోరి లాగా కాంగ్రెస్ ను ఇబ్బంది పెట్టాలని బీజేపీ తీవ్రంగా కసరత్తు చేస్తుందన్నారు. పది ఏండ్లలో నే దేశం అల్లకల్లోలం అయిందన్నారు. బీజేపీ అధికారంలోకి రాకుండా చూసే బాధ్యత బడుగు బలహీన వర్గాలదే అన్నారు. ఇది ప్రజా స్వామ్యనికి అత్యంత దయనీయమైన పరిస్థితి అన్నారు. బీజేపీ వలన బలహీన వర్గాలు, దళిత, గిరిజనులు హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. బీజేపీకి ఓటేస్తే భవిష్యత్ లేకుండా పోతుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భారత దేశం పెను ప్రమాదంలోకి నెట్టి వేయబడుతుందన్నారు. ఆ కుట్రని అర్థం చేసుకొని రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర, న్యాయ యాత్ర చేశారన్నారు. ఓబీసీ కులగణన చేసి జనాభా దామాషా ప్రకారం ఆస్తులు పంచుతామని రాహుల్ గాంధీ చెప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కులగణన చేపడుతామన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో కులగణన ప్రక్రియ మొదలైందన్నారు. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో 14 సీట్లు గెలిచేలా సాయం చేయాలన్నారు.

# మూడు రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్ష సూచన

## మొదటి పేజీ తరువాయి

శీతలపానియాల వెంట పరుగులు తీస్తున్నారు. కొన్ని రోడ్లు అయితే కర్ఫ్యూ విధించినట్లు నిర్మానుశ్యంగా కనిపిస్తున్నాయి. ఇలాంటి మండుటెండల్లో వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. తెలుగు రాష్ట్రాల్లో ఏప్రిల్ నెల నుంచి సూర్యప్రతాపం ఓ రేంజ్ లో కొనసాగుతుంది. ఎండ వేడి తట్టుకోలేక ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు ఉన్నా కూడా అధిక ఉష్ణోగ్రతలు తట్టుకోలేపోతున్నారు. ఇలాంటి మండుటెండల్లో హైదరాబాద్ వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. రాబోయే మూడు రోజులు రాష్ట్రానికి రెయిన్ అలర్ట్ ప్రకటించింది. తెలంగాణలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు వెల్లడించింది. ద్రోణి ప్రభావంతో రాష్ట్రానికి వర్ష సూచన అందించింది. ఉరుములు, మెరుపులతో కూడిన ఈదరు గాలులతో భారీ వర్షాలు నమోదు అయ్యే సూచన ఉందని తెలిపింది. బుధవారం రాష్ట్రంలోని 7 జిల్లాలకు భారీ వర్ష సూచన ప్రకటించింది వాతావరణ శాఖ. వరంగల్, హన్మకొండ, మహబూబ్ నగర్, జనగాం, నల్లగొండ, యాదాద్రి జిల్లా, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. క్యుములోనింబస్ మేఘాల వల్ల కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలింది. అలాగే దక్షిణ, ఈశాన్య జిల్లాల్లో తెలిక పాటి వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఈ క్రమంలోన రాష్ట్రంలోఆరెంజ్ అలర్ట్ పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సోమవారం తెలంగాణలో 47 డిగ్రాలు దాటి ఉష్ణగ్రతలు, జిగిత్యాల జిల్లా వెల్గటూర్ లో అత్యధికంగా 47.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది.

# బోధన, బోధనేతర నియామకాల రద్దుపై సుప్రీం సీరియస్

న్యూ ఢిల్లీ, మే 07 (తీన్మార్ న్యూస్): బెంగాల్ ప్రభుత్వం బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల రద్దుపై కోల్‌కత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. అయితే ఈ కుంభకోణంపై విచారణ జరిపేందుకు సీబీఐకి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. అయితే అభ్యర్థులపై కానీ ప్రభుత్వ ఉన్నతాధికారులపైన కానీ బలవంతంగా చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. ఈ నియామకాలు వ్యవస్థగత మోసమని అభివర్ణించింది. మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన నాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జేబీ పర్దీవాలాతోపాటు మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ఈ మేరకు అనుమతి ఇచ్చింది. అయితే ఆ అంశంపై సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు, టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జి స్పందించారు. సత్యం గెలిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు బెంగాల్ ప్రతిష్టను మసక బార్చేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాన్ని సుప్రీంకోర్టు నిర్వీర్యం చేసిందన్నారు. అయితే ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని ప్రజలతో కలిసి భుజం భుజం కలిపి పోరాడతామని అభిషేక్ బెనర్జీ ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిర్వహించిన బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల్లో కుంభకోణం చోటు చేసుకుందని కొల్‌కత్తా హైకోర్టు స్పష్టం చేసింది. ఆ క్రమంలో అందుకు సంబంధించిన నియామకాలన్నీ రద్దు చేస్తూ.. ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన కోల్‌కతా హైకోర్టు ఆదేశించింది. దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని సూచించింది. ఈ విచారణను మూడు నెలల్లో పూర్తి చేసి నివేదికను అందజేయాలని హైకోర్టు తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఇక జీతాలు తీసుకున్న వీరంతా.. 12 శాతం వడ్డీతో తిరిగి ప్రభుత్వానికి చెల్లించాలని పేర్కొంది. కోల్‌కత్తా హైకోర్టు ఆదేశాలపై మమతా బెనర్జీ ప్రభుత్వం మండిపడింది. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మమతా బెనర్జీ ప్రకటించిన సంగతి తెలిసిందే. 2016లో రాష్ట్రంలోని ఎయిడెడ్ పాఠశాల్లో బోధన, బోధనేతర ఉపాధ్యాయుల కోసం పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. దాదాపు 24 వేల ఈ ఉద్యోగాల కోసం 23 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. అయితే ఈ పరీక్షల్లో భారీగా అవకతవకలు జరిగాయంటూ పలువురు అభ్యర్థులు కోల్‌కత్తా హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో విచారణ జరిపిన హైకోర్టు.. ఉద్యోగ నియామకాలను మొత్తం రద్దు చేసింది.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం

## లోతట్టు ప్రాంతాల సమస్యలపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి

## తీవ్రత ఎక్కువగా ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచనలు



హైదరాబాద్, మే 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో భారీ వర్షాలు పడుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అలాగే భారీ వర్షం, ఈదురుగాలులతో రాజధాని హైదరాబాద్ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమవడం, ట్రాఫిక్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్షించారు. వరంగల్ పర్యటనలో ఉన్నసీఎం అక్కడి నుంచే జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, సిటీ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాసరెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ ఎస్.ఏ.ఎం రిజ్వి, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. భారీ వర్షాలు, ఈదురుగాలులతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే సమస్యను త్వరితగతిన పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో జలమయమైన కాలనీల్లో ప్రజకు అవసరమైన చేయూతను అందించాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యను సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేసి వాహనదారులు త్వరగా ఇళ్లకు చేరుకునేలా చూడాలని పోలీసు అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది చేపట్టే సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని, సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు.

# లోక్ సభ ఎన్నికల పోటీ జాతీయ పార్టీల మధ్యే

## మొదటి పేజీ తరువాయి

చెప్పుకొచ్చారు. అక్రమార్కులు బీఆర్ఎస్, బీజేపీ వాళ్లు తొందరపాటు నిర్ణయాలు తీసుకోం చెప్పిన ప్రతి మాటకు కట్టుబడి ఉన్నామన్నారు. ఇక, ఫోన్ ట్యాపింగ్ పై అధికారులు ఇప్పటి వరకు నాకు నివేదిక ఇవ్వలేదన్నారు. నివేదిక వచ్చే వరకు నేను కూడా దీనిపై మాట్లాడటం సరికాదు నివేదిక వచ్చిన తర్వాత ఫోన్ ట్యాపింగ్ పై అసెంబ్లీ వేదికగా ప్రజలకు స్పష్టంగా చెబుతాను అని ఆయన పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ లో దర్యాప్తులో అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామన్నారు. తెలంగాణలో జవాబుదారీతనం తీసుకొచ్చాం. ప్రజాపాలనలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కాగా, రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లు రద్దు చేస్తామని కొందరు బీజేపీ నేతలు చెప్పారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు అనే విషయాన్ని సీఎం రేవంత్ ఎన్టీవీ క్వశ్చన్ అవర్ కార్యక్రమంలో చెప్పుకొచ్చారు. బీజేపీ ఫిర్యాదు మేరకే కాంగ్రెస్ పార్టీకి చెందిన సోషల్ మీడియా సభ్యులను అరెస్ట్ చేశారని ఆయన మండిపడ్డారు. కులగణన చేసి 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టింది, కులగణను బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తుందన్నారు. బీజేపీ ప్రణాళికను మేము బయటపెట్టాం కాబట్టి వాళ్లంతా వివరణ ఇస్తున్నారు. అమిత్ షాపై కామెంట్స్ చేస్తే కేంద్ర హోంశాఖ ఎందుకు ఫిర్యాదు చేసిందని ప్రశ్నించారు. అలాగే, ఢిల్లీ పోలీసులు, లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ఎలా వస్తారంటూ మండిపడ్డారు. ముఖ్యమంత్రిపై కేసు పెడితే తెలంగాణ కోసం పులినోట్లో తలకాయ పెడతానన్న వాళ్లు ఉ ఒదుకు స్పందించలేదు అని అడిగారు. నోటీసులు ఇవ్వగానే ఇక్కడ భయపడేవాళ్లు ఎవరు లేరు. అన్నింటికీ సిద్ధంగానే ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# ఐదునెలలుగా "కాంగ్రెస్" దుకాణం కేసీఆర్ ను తిట్టడమే

## మొదటి పేజీ తరువాయి



కేసీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. కేసీఆర్ కల్యాణలక్ష్మి రూ.లక్ష ఇస్తున్నడు. మేం తులం బంగారం కలిపి ఇస్తం అన్నరు. ఎక్కడైనా తులం బంగారం వచ్చిందా.. రైతుబంధు అందరికి పడ్డదా.. మొన్న ముఖ్యమంత్రి 9వ తారీఖులోపల వేస్తం అన్నడు మరి వచ్చిందా అని ప్రశ్నించగా రాలేదని జనం నినదించారు. ఇగ రాదు. ఆయననే కుట్ర చేసి ఎలక్షన్ కమిషన్‌కు తెలియజేసి.. మళ్లీ ఆయననే బ్యాన్ చేసిండు. ఇప్పుడు ఏం అంటడు, రైతుబంధు రాదు. దాని కథ ఒడిసిపోయింది అన్నారు. మళ్లీ రేపు ఏమంటడు. ఐదెకరాలు ఉన్నోడికి వేస్తా అని మాట్లాడుతడు. ఆరెకరాల రైతు, ఏడెకరాల రైతు ఏం తప్పు చేసిండు, ఈ రకంగా రైతుబంధు ముంచిన్రు. కరెంటు కోతలు ఉన్నయా.. పొలాలు ఎండినయా.. కామారెడ్డిలో బాగా ఎండినయట నిజమేనా.. మరి కరెంటు ఏమైందని నేను అడుగుతున్న. కేసీఆర్ ఉన్నప్పుడు తొమ్మిది సంవత్సరాలు రెప్పపాటు పోకుండా కరెంటు ఎంత బాగా వచ్చింది, మరి ఇప్పుడు ఏం మాయరోగం వచ్చింది. ఎక్కడికిపోయింది మన కరెంటు, ఇప్పుడు దానిపై ఉల్టా పల్టా మాట్లాడడమే తప్ప ఏం లేదు. మంచినీళ్లు సరిగా వస్తున్నయా.. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదా.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కామారెడ్డిలాంటి పట్టణాల్లో ఒక్క రూపాయికే పేదలకు నల్లా కనెక్షన్ ఇచ్చి, గ్రామాల్లో ఫ్రీగా కనెక్షన్ ఇచ్చి బ్రహ్మాండంగా నీళ్లు సరఫరా చేశాం. ఎక్కడికి పోయినయ్ నీళ్లు ఏం రోగం వచ్చింది దానికి దయచేసి అందరూ ఆలోచించాలి. కరెంటు పోయింది. మంచినీళ్లుపోయినయ్. వడ్లు కొంటున్నరా.. రూ.500 బోనస్ వస్తున్నదా.. బోనస్ బోగస్ అయింపోయింది. అంటూ విమర్శించారు. ముఖ్యమంత్రి ఓ మాట చెప్పిండు. కేసీఆర్ ఉన్నప్పుడు రూ.లక్ష మాఫీ చేసిండు. నేను రూ.2లక్షలు మాఫీ చేస్తా.. డిసెంబర్ 9నాడే సంతకం పెడతా.. మీరు బ్యాంకులకు వెళ్లి రూ.2లక్షల అప్పు తెచ్చుకోమన్నడు. మరి రూ.2లక్షల రుణమాఫీ వచ్చిందా.. రుణమాఫీ కాలేదా.. ఇప్పుడు ముఖ్యమంత్రి ఊరికిపోతే ఆ ఊరి దేవుడిపై ఒట్టు వేస్తున్నడు. చేసే సిపాయి ఎవడన్న ఒట్లు పెట్టుకంటడా.. ఒట్లు పెట్టుకునుడు.. కేసీఆర్‌ను తిట్లు తిట్టు తప్ప ఇంకో ముచ్చట లేదు. అయితే దేవునిమీద ఒట్లు. లేకపోతే కేసీఆర్‌పై తిట్లు. ఇదే కథ కదా.. ఐదునెలలుగా ఇదే దుకాణం. ఇగ ఆడబిడ్డలకు రూ.2500 నెలకు ఇస్త అన్నడు వచ్చినయా.. కామారెడ్డిలో వచ్చినయట కదా.. హైదరాబాద్‌లో చెబుతున్నరు. ఇట్ల ఏ మాట కూడా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అని చెప్పి ఏ మాట కూడా నిలబెట్టుకోలేదు. అది నిలబెట్టుకోకుంటే నిలబెట్టుకోకపోయారు. పాత రైతుబంధు కూడా ఇవ్వలేదు. పంటలు కోసే సమయం వచ్చినా ఇవ్వలేదు అంటూ మండిపడ్డారు.

# మాలాంటి వారినైతే అరెస్టు చేస్తారు

## ప్రజ్వల్ రేవణ్ణ వంటి వారిని దేశం దాటిస్తారు

## మాలాంటి వారిని అరెస్ట్ చేయడం అన్యాయం : ఎమ్మెల్సీ కవిత



న్యూఢిల్లీ, మే 07 (తీన్మార్ న్యూస్): ప్రజ్వల్ రేవణ్ణ వంటి వారిని దేశం దాటించారు.. మాలాంటి వారిని అరెస్టు చేయడం చాలా అన్యాయం అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. ఈ విషయం అందరూ గమనించాలని కోరుతున్నానని కవిత సూచించారు. మంగళవారంతో కవితకు జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో ఆమెను మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. కవితకు ఈ నెల 14వ తేదీ దాకా జ్యుడిషియల్ కస్టడీ పొడిగించింది కోర్టు. ఈ సందర్భంగా కవిత కోర్టు హాలు నుంచి బయటకు వస్తూ పై వ్యాఖ్యలు చేశారు. జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్ వ్యవహారం కర్ణాటకలో రాజకీయ దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల ప్రచారం మొత్తం సెక్స్ స్కాండల్ చుట్టూనే తిరిగింది. ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) బెంగళూరులోని బసవనగుడిలో గల మాజీ ఎమ్మెలే, ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ ఇంట్లో సోమవారం తనిఖీలు నిర్వహించి కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకొంది. మరోవైపు ప్రజ్వల్ స్వదేశానికి త్వరలో తిరిగి రావొచ్చనే అంచనాల నేపథ్యంలో బెంగళూరు విమానాశ్రయం వద్ద భద్రత సిబ్బంది అప్రమత్తం అయ్యారు.

# రైతు భరోసాపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ

## మొదటి పేజీ తరువాయి

అంచనాలను తారుమారు చేస్తూ ఎన్నికల సంఘం రైతు భరోసా నిధుల పంపిణీకి బ్రేక్ వేసింది. అయితే గతంలో ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలోని 64,75,320 మంది రైతుల ఖాతాల్లో రూ.5,575 కోట్ల రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఐదు ఎకరాలు పైబడి దాదాపు 5 లక్షల మందికి పైగా రైతులు ఉండడంతో వారికి కూడా రైతు భరోసా నిధులను విడుదల చేయడానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ నిధులను మే 9వ తేదీలోగా విడుదల చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి గతంలో రైతులకు హామీ ఇచ్చారు. అనుకున్నట్లుగానే ఇచ్చిన మాట ప్రకారం మే 6వ తేదీన రూ.2వేల కోట్ల రైతు భరోసా నిధులను రేవంత్ రెడ్డి సర్కార్ విడుదల చేసింది. తొలిరోజే చాలా మంది రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేసింది. అయింతే రైతు భరోసా నిధుల పంపిణీపై సీఈసీ తీసుకున్న నిర్ణయం కారణంగా ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాతనే మిగిలిన రైతుల ఖాతాల్లో నగదు జమ కానుంది. అటే మే 13వ తేదీ తర్వాత మరలా ఈ రైతు భరోసా నిధుల జమ ప్రక్రియను అధికారులు ప్రారంభిస్తారు.

# కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ పై సుప్రీంకోర్టులో విచారణ

## మొదటి పేజీ తరువాయి

మధ్యంతర బెయిల్ పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసు దర్యాప్తులో తీవ్ర జాప్యం ఎందుకు జరిగిందని ఈడీని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కేసులో నిందితులుగా ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాల అరెస్టుకు ముందు, తర్వాతి కేసు ఫైళ్లను సమర్పించాలని ఆదేశించింది. కేసును విచారించే క్రమంలో సాక్షులు, నిందితులకు డైరెక్ట్ ప్రశ్నలను ఎందుకు అడగలేదని ఈడీని నిలదీసింది. కేజ్రీవాల్‌ను ప్రజలు ఎన్నుకున్నారు. ఆయన కూడా ఈ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనాల్సి ఉంది. అందుకే మధ్యంతర బెయిల్ కోసం కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు వింటాం అని సుప్రీంకోర్టు బెంచ్ తేల్చి చెప్పింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఈడీ తరపు న్యాయవాది, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు రాజకీయ నాయకుల కోసం కోర్టు సెపరేట్ నిబంధనలను అమల్లోకి తేలేదన్నారు. మొదట్లో ఈ కేసులో కేజ్రీవాల్ పేరు తెరపైకి రాలేదని, తర్వాతి దశలో ఆయన పాత్ర ఉన్నట్లు స్పష్టమైందన్నారు. కేజ్రీవాల్ అరెస్టులో రాజకీయ కోణం లేదని సుప్రీంకోర్టుకు ఈడీ తెలిపింది. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా తమ వద్ద సరిపడా ఆధారాలు ఉన్నాయని వెల్లడించింది. 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల టైంలో గోవాలోని 7 స్టార్ హోటల్ గ్రాండ్ హయత్ లో సీఎం కేజ్రీవాల్ బస చేశారు. దానికి సంబంధించిన బిల్లులో కొంత భాగాన్ని ఢిల్లీ ప్రభుత్వం, ఇంకొంత భాగాన్ని ఆప్ ప్రచారానికి నిధులు సేకరించిన చన్‌ప్రీత్ సింగ్ చెల్లించారు అని సుప్రీంకోర్టుకు ఈడీ తెలిపింది. ఈ కేసులో అప్రూవర్లుగా మారిన వారి వాంగ్మూలాలను తాము అటకెక్కించామని కేజ్రీవాల్ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని పేర్కొంది. దీనికి సంబంధించిన డాక్యుమెంట్లను కోర్టుకు సమర్పించింది.

# ఎంసెట్ పరీక్ష రాసే విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

## మొదటి పేజీ తరువాయి

పరీక్ష సమయం కాగా 3 గంటలకు పరీక్షా కేంద్రంలోకి వెళ్లిన విద్యార్థులు రాత్రి 7 గంటలైనా బయటకు రాకపోవడం తో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. అసలు పరీక్ష కేంద్రంలో ఏం జరుగుతుందో చెప్పే వారు లేకపోవడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించకపోవడంతో ఆగ్రహించిన విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాల ఎదుట ఉన్న రాజీవ్ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దాదాపు అరగంట పాటు నిర్వహించిన రాస్తా రోకో తో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు విద్యార్థుల తల్లిదండ్రులను సముదాయించి రాస్తారోకో ను విరమింపజేశారు. అయింతే విద్యార్థులు రాసే ఎంసెట్ పరీక్ష ఆన్లైన్ లో నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా కళాశాలలో ఉన్న జనరేటర్ ఆన్ చేసి పరీక్ష నిర్వహిస్తున్నారు. అయితే సాయంత్రం గాలి, వాన తీవ్రం కావడంతో పాటు కళాశాల సమీపంలో పిడుగు పడటంతో జనరేటర్ లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో కళాశాల యాజమాన్యం స్పందించి జనరేటర్ ను మరమ్మత్తు చేసే వరకు దాదాపు గంట సమయం పట్టడంతో పరీక్ష నిర్వాహకులు విద్యార్థులకు అదనంగా గంట సమయం కేటాయించగా ఆలస్యం అయిందని కళాశాల యాజమాన్యం తెలపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## మారిన మోడీ ప్రచారం...

మాట మారింది.. తీరు మారింది. అభివృద్ధి మంత్రం పక్కకు పోయింది. హిందూత్వ ఏజెండా ముందుకు వచ్చింది. మతం మళ్లీ ఆయుధమైంది. పాక్ పేరు మళ్లీ వినిపిస్తోంది. ఏంటి ఇదంతా అనుకుంటున్నారా.. ? ప్రధాని నరేంద్రమోడీ ప్రచారాన్ని అబ్జర్వ్ చేస్తే కనిపించిన విషయాలు. ఇంతకీ మోడీ ప్రచారం ఎలా మొదలైంది.. ? ఇప్పుడు ఎలా కొనసాగుతుంది? 400 సీట్లు.. ఎన్డీఏ కూటమికి ప్రధాని మోడీ ఇచ్చిన టార్గెట్ ఇది. ఈ టార్గెట్‌ను రీచ్ అయ్యేందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకున్నారు. దీనికి తగ్గట్టుగానే మోడీ ప్రచారం మొదలుపెట్టారు. తమ విజన్ 2047 అని.. దేశంలో అభివృద్ధికి రూట్ మ్యాప్ వేస్తున్నామని ప్రచారం చేశారు. ఇంతలో ఫస్ట్, సెకండ్ ఫేజ్ ఓటింగ్ ముగిసింది. కానీ ఆ తర్వాత ఆయన రూట్ మార్చారు. సడెన్‌గా మళ్లీ ముస్లిం రాగం ఎత్తుకున్నారు. విద్వేష పూరిత వ్యాఖ్యలు మొదలు పెట్టారు.ఎందుకు ఒక్కసారిగా మోడీ ప్రచార శైలి మారింది? ఉన్నట్టుండి ఎందుకు విద్వేష పూరిత వ్యాఖ్యలు చేస్తున్నారు.. ? మత ప్రాతిపదికన ఎందుకు ప్రచారం చేస్తున్నారు? ఇదే ఇప్పుడు బిగ్ క్వశ్చన్.. ఎప్పుడైతే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మాట్లాడిన మాటలు వైరల్ అయ్యాయో.. అప్పటి నుంచి మోడీ తన ప్రచార స్టైల్‌ను మార్చేశారు. చొరబాటుదారులు, మంగసూత్రాలు లాక్కుంటారు అనే పదాలను తన స్పీచ్‌లో వాడటం మొదలు పెట్టారు. అప్పుడెప్పుడో 18 ఏళ్ల నాటి వీడియో సడెన్‌గా బయటకు రావడం.. దానిపై మోడీ రియాక్ట్ అవ్వడం.. నిజంగా కొంచెం అనుమానస్పదం గానే ఉంది.ఫస్ట్ ఫేజ్ ఓటింగ్ ముగిసన తర్వాత ఆయన టోన్ మార్చారు. నిజం చెప్పాలంటే మోడీ ప్రచారంలో రామమందిర ప్రాణప్రతిష్ఠ రానురాను తగ్గిపోయింది. గత ఎన్నికల్లో చౌకీదార్ అని చెప్పుకున్నారు మోడీ.. కానీ ఈసారి వచ్చేసరికి మోడీకి గ్యారెంటీ అన్నారు. కానీ దానిని కూడా ఇప్పుడు తక్కువగా వాడుతున్నారు. ఆయన క్యాంపెయిన్‌ను అబ్జర్వ్ చేస్తే ప్రచారం మొత్తం రిజర్వేషన్లు, కాంగ్రెస్‌పై విమర్శలపైనే ఫోకస్ చేస్తున్నట్టు కనిపిస్తోంది.తన ప్రచారంలో పాకిస్థాన్‌ను కూడా ఇన్‌క్లూడ్ చేశారు మోడీ.. పాక్ మాజీ మంత్రి చౌదరి ఫవాద్ హుస్సేన్ రాహుల్ గాంధీపై ప్రశంసలు కురిపించిన విషయాన్ని గుర్తు చేశారు. యువరాజును ప్రధానిని చేయాలని పాకిస్థాన్ తహతహలాడు తోందంటూ మరోసారి సెంటిమెంట్‌ను రగిల్చే ప్రయత్నం చేశారు. దేశంలో కాంగ్రెస్ బలహీనంగా తయారవ్తోంది. ఇక్కడ కాంగ్రెస్ చనిపోతుంటే అక్కడ పాకిస్థాన్ ఏడుస్తోంది. కాంగ్రెస్ కోసం పాకిస్థానీయులు ప్రార్థనలు చేస్తున్నారంటూ తనదైన స్టైల్‌లో విమర్శలు చేశారు మోడీ.. అంతేకాదు ప్రధాని మోడీ ప్రసంగంలో ఈ మధ్య ఎక్కువగా వినిపించే పదం కాంగ్రెస్ మేనిఫెస్టో.. ఇలా విని విని.. అసలు ఇప్పటి వరకు కాంగ్రెస్ మేనిఫెస్టోను చూడని వారు కూడా చూసేలా చేస్తున్నారు మోడీ.. సో.. ఇన్‌డైరెక్ట్‌గా ఈ మేనిఫెస్టోకు మోడీ ప్రచారం చేస్తున్నట్టు కనిపిస్తుంది.మొత్తంగా చూస్తే మోడీ పదేళ్ల పాలనలో చేసిన విజయాలన్ని పక్కకు వెళ్లిపోయాయి. పాకిస్థాన్‌పై సర్జికల్ దాడులు, కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాఖ్ రద్దు.. అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ, జన్‌ధన్ యోజన, 80 కోట్లమందికి ఉచిత ఆహార ధాన్యాలు.. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవడం.. వంటి అంశాలపై బీజేపీ నేతలు చాలా అంటే చాలా తక్కువగా మాట్లాడుతున్నారు. దీనికి బదులు కాంగ్రెస్ చేస్తున్న రిజర్వేషన్ ప్రచారాన్ని తిప్పి కొట్టడానికే ఎక్కువ టైమ్ కేటాయిస్తున్నారు. దీనికి బెస్ట్ ఎగ్జాంపుల్ నిన్న మోడీ మాట్లాడిన మాటలు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని.. రిజర్వేషన్లు ఉండవని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టడమే మోడీ పనిగా పెట్టుకున్నారు. మోడీ తీరు చూస్తుంటే ప్రజల మెదళ్లలో కాంగ్రెస్ రిజర్వేషన్ అనుమానాలను నాటడంలో కాంగ్రెస్ సక్సెస్ అయినట్టే కనిపిస్తోంది. వీటితో పాటు.. మొదటి రెండు ఫేజ్‌లలో బీజేపీకి తక్కువ ఓటింగ్ పడినట్టు కనిపిస్తోంది. ఈ రిపోర్ట్‌ల ఆధారంగానే మోడీ తన ప్రచారశైలిని మార్చారన్న ప్రచారం కూడా ఉంది. కానీ ఏది ఏమైనా ప్రస్తుతం మోడీ నుంచి ప్రస్తుతం వినిపిస్తున్న కాంగ్రెస్ పదం.. బీజేపీకి మంచి చేస్తుందా? ముంచుతుందా? అనేది జూన్ 4న తేలనుంది.

# ఇదేనా డిజిటల్ ఇండియా.....?

- ఇదేనా బంగారు తెలంగాణ.?ఇంకెనేళ్లు మోసపు అబద్ధాలు
- ఎంపీ అభ్యర్థి చల్లా వంశీ చంద్ రెడ్డి మద్దతుగా జోరుగా చేరికలు
- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో చేరికల జోష్
- అబద్దాలు అవాస్తవాలు మభ్య పెట్టే హామీలతో గద్దెనెక్కిన బిజెపి బిఆర్ఎస్
- ఇంకా కాలం చెల్లింది బిజెపి బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి
- మన కంటిని మన వేళ్ళతో పొడుచుకోవద్దు రక్షించుకుందాం
- ఎంపీగా వంశీ చంద్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం
- పాలమూరు తలరాతను మార్చుకుందాం
- పాలమూరు సీఎం రేవంత్ మానస పుత్రిక
- ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలోకి
- ఎండను లెక్కచేయకుండా పెద్ద ఎత్తున స్వాగతం-గ్రామాల ప్రజలు
- హామీలు నెరవేర్చని బిజెపి పార్టీకి బుద్ధి చెప్పాలి
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



దేవరకద్ర ప్రతినిధి, మే 07(తీన్మార్ న్యూస్): ఇదేనా డిజిటల్ ఇండియా.? 10 ఏళ్లుగా పాలమూరు అభివృద్ధి పట్టించుకోని నరేంద్ర మోడీ ఓట్ల కోసం ఢిల్లీ నుండి తెలంగాణ గల్లీకి వచ్చాడని, బంగారు తెలంగాణ అని పచ్చి అబద్దాలతో మోసం చేసిన దుర్మార్గుడు కెసిఆర్ ఇంకెనేళ్లు మోసపు హామీలు అబద్ధాలతో మోసం చేస్తారని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండలం లోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా బండ్రవల్లి, లాల్ కోట, ఫర్దిపూర్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే జియంఆర్ ఎండను సైతం లెక్కచేయకుండా పెద్ద ఎత్తున స్వాగతం పలికిన ఆయా గ్రామాల ప్రజలు, గ్రామస్తులను, మహిళలను పలకరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి చల్లా వంశీచంద్ రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరిన ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి,మహబూబ్నగర్ జడ్పీ చైర్ పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి,టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకులు ఏ.పి మిథున్ రెడ్డి, మరియు పలువురు నియోజకవర్గ, మండల నాయకులు, అంతకు ముందు, కౌకుంట్ల మండలం రేకులంపల్లీ పల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ స్వామి మరియు టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాంత్ రెడ్డి, వీరితో పాటు పలువురు వార్డ్ మెంబెర్స్, మాజీ వార్డ్ మెంబెర్స్, బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, పలువురు నాయకులు మరియు 40 మంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూధన్ రెడ్డి, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, కౌకుంట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్



పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన కు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరామని తెలిపారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ అబద్ధాలు అవాస్తవాలు మభ్య పెట్టే హామీలతో గద్దెనెక్కిన బిజెపి బిఆర్ఎస్ అని అన్నారు. ఇంకా కాలం చెల్లింది బిజెపి బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, కండ్లతో చూస్తూ మన కంటిని మన వేళ్ళతో పొడుచుకోవద్దు రక్షించుకుందాం, పాలమూరును అభివృద్ధి చేసుకుందామని కోరారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చని బిజెపి పార్టీకి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో రెండు లక్షల మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీ చంద్ రెడ్డి గెలవబోతున్నారని ఈ సందర్భంగా జిఎంఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# బిజెపి బందిఖానా నుంచి దేశాన్ని విముక్తి చేద్దాం

- ఓటుతో బిజెపిని ఓడిద్దాం అనే పుస్తకం ఆవిష్కరణ
- కార్మికులు హస్తం గుర్తుకు ఓటు వెయ్యాలి
- కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీధర్ రెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం
- జీఎస్టీ పేరుతో వనరులన్నీ బిజెపి గుప్పెట్లో
- విద్యా వైద్యం వ్యవసాయ రంగాలను కార్పోరేట్ చేసేందుకు ప్రయత్నం
- ఈడి ఐటి సిబిఐ తదితర వ్యవస్థలను నరేంద్ర మోడీ చేతిలో
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్

దేవరకద్ర ప్రతినిధి, మే 07(తీన్మార్ న్యూస్): బిజెపి పార్టీ నరేంద్ర మోడీ బందిఖానా నుండి దేశాన్ని విముక్తి చేద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ కోరారు. మంగళవారం నాడు వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలో ప్రసంగిస్తూ ఓటుతో బిజెపిని ఓడిద్దాం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. పాలమూరు పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీధర్ రెడ్డి హస్తం గుర్తుకు ఓటేయాలని ఆయన



కార్మికులను కోరారు. రాష్ట్ర హక్కులను అధికారాలను మోడీ ప్రభుత్వం హరిస్తున్న దని జీఎస్టీ పేరుతో వనరులన్నీ గుప్పెట్లో పెట్టుకున్నదని ఆయన అన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసిందని మూడు రైతు వ్యతిరేక చట్టాలు అమలు చేసేందుకు విఫల ప్రయత్నం చేసిందని ఆయన చెప్పారు. విద్యా వైద్యం వ్యవసాయ రంగాలను కార్పోటీకరించేందుకు వేగంగా ప్రయత్నం చేసిందని, విద్యుత్ చట్టం సవరణల ద్వారా సాధారణ ప్రజల మీద భారాలు మోపుతుందని ఈడి ఐటి, సిబిఐ తదితర స్వతంత్ర వ్యవస్థలను ప్రధాని గుప్పెట్లో చేతిలో పెట్టుకున్నారని తమకు లొంగని వారి పైన దాడులు చేసేందుకు బ్లాక్ మెయిలింగ్ సాధనలుగా వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, వివిధ కార్మిక సంఘాల నాయకులు నెల్లూరు కురుమన్న, గొల్ల కురుమన్న నరసింహ, లక్ష్మీనారాయణ, లక్ష్మీ, పంతులు వెంకటేశు, పెంటన్న, రాములు, తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి మేఘన్న చేయూత



పెబ్బేరు, మే 07(తీన్మార్ న్యూస్): పెబ్బేరు మండలం, రంగాపురం గ్రామానికి చెందిన రాంపోగు బాలమ్మ అనారోగ్యం కారణంగా సోమవారం రాత్రి మృతి చెందడంతో గ్రామ కాంగ్రెస్ నాయకులు ఇట్టి విషయాన్ని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకుపోగా మేఘన్న చేయూత కింద 5వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కావలి చిన్నోడు, కావలి భగవంతు, బేరికి లక్ష్మణ్, కావలి బాలకృష్ణ, మరగల వెంకటేష్, పిట్ట మన్నెం, రాంపోగు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ వల్లనే దేశం ఇప్పటికీ సురక్షితం

- ఎన్నికల లబ్ధి కొరకే 9 తారీఖు వరకు రైతుబంధు జమ
- అల్వాల్ గ్రామ బీజేపీ ముఖ్య కార్యదర్శి రాములు విరాట్ యాదవ్

వనపర్తి ప్రతినిధి, మే 07(తీన్మార్ న్యూస్): దేశంలో భారతీయ జనతా పార్టీ ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వస్తుందని వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలం అల్వాల్ గ్రామ బీజేపీ ముఖ్య కార్యదర్శి బూత్ అధ్యక్షుడు రాములు విరాట్ యాదవ్ అన్నారు. ఈ దేశాన్ని 60 సంవత్సరాల పాటు పరిపాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కుంభకోణాల లో చిక్కుకొని ఈ దేశాన్ని బస్టు పట్టించాయని ఆయన విమర్శించారు. భారతీయ జనతా పార్టీ ఈ దేశాన్ని కేవలం 15 సంవత్సరాల కాలం మాత్రమే పరిపాలించి దేశ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా మిగిలిపోయాయని, దేశ మాజీ ప్రధానమంత్రిగా స్వర్గీయ అటల్ బీహార్ వాజ్పేయి, ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సుపరిపాలన అందిస్తూ ఈ దేశాన్ని టెర్రరిస్టుల రక్షణ కవచం లో భాగంగా బిజెపి పని చేస్తూ ఈ దేశాన్ని రక్షిస్తుందని ఆయన అన్నారు. దేశ ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవిస్తున్నారంటే అందుకు ప్రధాన కారణం దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేస్తున్న విశిష్ట కృషి వలన ఈరోజు భారత దేశ ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గత టీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు దరిచేరకుండా ప్రచారం చేయకుండా బీజేపీ ప్రభుత్వం పై దుమ్ము పోయడం ఎంతవరకు సమంజసం అని ఆయన అన్నారు. ఒక్కసారి బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు గమనించి విశ్లేషించి పరిశీలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈనెల



13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో 17 స్థానాల్లో భారతీయ జనతా పార్టీ 15 స్థానాలు కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వచ్చే నెల జూన్ లో భారతీయ జనతా పార్టీ భారత ప్రభుత్వంగా మరోసారి పార్లమెంటు భవనం పై బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో రైతులకు ఇచ్చిన హామీలు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దొంగ తిరుగుడు మాటలు చెపుతున్నాడని ఆయనే అన్నారు. ఇప్పటివరకు రైతుబంధు చెల్లించని ముఖ్యమంత్రి ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని ఈ నెల తొమ్మిది తారీకు రోజు అందరికీ రైతుబంధు డబ్బులు జమ చేస్తామని చెప్పడం కేవలం ఎన్నికల లబ్ధి కోసమే అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా ప్రజలు నిరసన జ్వాలలు వ్యక్తం చేస్తున్నారని ఎక్కడ చూసినా వ్యతిరేకత పెరిగిపోయిందని ప్రతి రాష్ట్రంలో బిజెపి వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రజలు కాంగ్రెస్ పార్టీ టిఆర్ఎస్ పార్టీ మాయమాటలకు మోసపోకుండా వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి పార్టీకి పట్టం కట్టాలని ఆయన కోరారు.

# కుర్రారంలో చామల గెలుపుకై కాంగ్రెస్ నాయకుల ప్రచారం







రాజాపేట, మే 07(తీన్మార్ న్యూస్): పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా భువనగిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోరుతూ రాజాపేట మండలం కుర్రారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గడపగడపకు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ చేయి గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ప్రకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కమిటీ సభ్యులు పాండవుల బసవరాజు గౌడ్, బూత్కూరి నరసింహారెడ్డి, పాండవుల లక్ష్మణ్ గౌడ్, బూరుగు రమేష్, భూపతి యాదగిరి,నీల నరసయ్య, గంపల ఆంజనేయులు, వల్లూరి వీరస్వామి ఎర్రగుంట రవీందర్, రావుల బాలయ్య, రావుల రాజు, బొల్ల చంద్రయ్య, కల్పగురి బాలరాజు, గ్రామ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ సిపిఎం, సిపిఐ మిత్రపక్షాల పార్టీలు కలిసి ఎన్నికల ప్రచారం

**– నల్గొండ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘువీర్ రెడ్డి గెలుపు కోసం ఎన్నికల ప్రచారం**



నేరేడుచర్ల, మే 07(తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ నల్గొండ పార్లమెంట్ అభ్యర్థి రఘు రెడ్డి గెలుపు కోసమై పాత నేరేడుచర్ల గ్రామం ఆంజనేయ స్వామి గుడిలో పూజా కార్యక్రమాలు చేపట్టి కొబ్బరికాయ కొట్టి ఒకటో వార్డుమున్సిపల్ కౌన్సిలర్ కొణతం చిన్న వెంకటరెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రాపోలు నరసయ్య, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, కౌన్సిలర్ రణపంగా నాగయ్య, సిపిఎం నాయకులు పోరేపల్లి శేఖర్ రావు, సిపిఐ నాయకులు ధనుంజయ నాయుడు, కాంగ్రెస్ పార్టీ సింగిల్ విండో డైరెక్టర్లు తాళ్ల సురేష్ రెడ్డి, దేవులపల్లి శంకరాచారి, కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ నాయకులు పాల్వాయి కృష్ణమూర్తి, కొణతం చిన్న సీతారాంరెడ్డి, రాచకొండ అజయ్, ఆకారపు వెంకటేశ్వర్లు, చింతమల్ల సైదులు, పాండు నాయక్, కాసాని పెద్ద సైదులు, కొణతం రంగారెడ్డి, కాసాని చిన్న సైదులు, శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మచ్చ శ్రీనివాస్, పోరెడ్డి లింగారెడ్డి, పోరెడ్డి బాలిరెడ్డి, సిరికొండ ఆదినారాయణ, ఎడవెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మంగ నాయక్, జంగిలి వెంకటేశ్వర్లు, కుంకు శ్రీనివాస్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ పేరాబోయిన వీరయ్య, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, లీలామణిషా రెడ్డి, కొనతం నర్సిరెడ్డి, కొణతం రాంరెడ్డి, ఊట్కూర్ నటరాజ్, మన్యం మాలాద్రి, మెమరీ, బంగారు బాబు, శ్రీకాంత్, వెంకటేష్, ఇందుమూరి వెంకన్న, పల్లి అమరారపు, కార్తీక్, కత్తి శ్రీనివాస్ రెడ్డి, బెల్లంకొండ సత్యం, గంట సైదులు, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీను, ఇసాక్, వీరబాబు, వంశి రెడ్డి, చింతల చెరువు సైదులు, మచ్చ రవికుమార్, కాసాని వెంకటేశ్వర్లు, పోలగాని వెంకటయ్య, చార గుండ్ల బాలరాజ్, కొనతం చిన్న వెంకటరెడ్డి, సైదిరెడ్డి, కొనతం కాంతారెడ్డి, కాపర్తి యాదగిరి, చిన్న వీరబాబు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు నక్క రమాదేవి, కొండా రామ గౌడ్, మారయ్య గౌడ్, అంజి గౌడ్, సిపిఎం నాయకులు కొదమగుండ్ల నగేష్, నీలా రామ్మూర్తి, ఎడ్ల సైదులు, సిపిఐ నాయకులు చిలకరాల శీను, శ్రీనివాస్ రెడ్డి, కొమ్రరాజు వెంకట్, సిపిఎం సిపిఐ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీగా తరలివచ్చి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని నల్గొండ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా రఘువీరుని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తెలిపారు.

# వడదెబ్బ" పై అవగాహన కార్యక్రమం

**– జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం**

**– అనంతరం గరిడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శన**



గరిడేపల్లి, మే 07(తీన్మార్ న్యూస్): ఆశా డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని వారు మాట్లాడుతూ వడదెబ్బ మరియు దాని లక్షణాల గురించి సిబ్బందికి మరియు ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రజలు ఈ వేసవికాలంలో ఎండ వేడిమికి గురికాకుండా చూసుకోవాలన్నారు. ఉదయం 10 గంటల లోపు సాయంత్రం ఐదు గంటల తర్వాత తమ పనులను చేసుకోవాలన్నారు ఎండకు బయటకు వెళ్ళినప్పుడు తల పైన టోపీ లేదా రుమాలు ధరించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బయటకు వెళ్ళినప్పుడు గొడుగు తీసుకుని వెళ్లాలన్నారు. ఇంటి వద్ద ఓ ఆర్ ఎస్ ద్రావణాన్ని తయారు చేసుకునే విధానం గురించి కూడా వివరించారు. తక్షణ ఉపశమనం కోసం ఇంటిలో దొరికే ఉప్పు మరియు పంచదారతో ద్రావణాన్ని తయారు చేసుకోవచ్చు అన్నారు. వడదెబ్బ గురికాకుండా చిటికెడు ఉప్పు చెంచా పంచదార తీసుకుని దానిలో ఒక గ్లాస్ వాటర్ లో కలుపు కొని తాగాలన్నారు. ఈ ద్రావణం రుచి మన కన్నీటి రుచిని పోలిఉంటుందని చెప్పారు. పలుచటి మజ్జిగ, నిమ్మకాయ రసం తాగాలన్నారు .ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వీ.నరేష్, జిల్లా మాస్ మీడియా అధికారి అనంత అంజయ్య గౌడ్, సి హెచ్ ఓ నరసింహ, పి హెచ్ ఎన్ ప్రమీల, సూపర్వైజర్స్ అంజయ్య గౌడ్, జి సోములమ్మ, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రఘునాథపురంలో బిఆర్ఎస్ పార్టీకి అపూర్వ స్పందన

**– గొల్లపల్లి రామ్ రెడ్డి**



రాజాపేట, మే 07(తీన్మార్ న్యూస్): రాజాపేట మండలం, రఘునాథపురం గ్రామంలో భువనగిరి పార్లమెంటు బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం ను గెలిపించాలని కోరుతూ మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షులు గొల్లపల్లి రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగగా నమూనా ఈవీఎం తో ఓటర్లకు అవగాహన కల్పిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా రామ్ రెడ్డి మాట్లాడుతూ రఘునాథపురం గ్రామం తో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో టిఆర్ఎస్ పార్టీకి అధిక ఓట్లు రానున్నాయని భీమా వ్యక్తం చేశారు. యువజన విభాగం అధ్యక్షులు పల్లె సంతోష్ కుమార్ గౌడ్, రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సట్టు తిరుమలేశ, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఎర్రగోకుల జశ్వంత్, గుర్రం సిద్ధిరాములు, కటకం స్వామి, తదితర నాయకులు పాల్గొన్నారు.

# మృత్యువాత పడిన గొర్రెలు

**– సందర్శించిన ప్రణాళిక సంఘ వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నరెడ్డి, ఆదిత్య రెడ్డి**





వనపర్తి ప్రతినిధి, మే 07(తీన్మార్ న్యూస్): పెద్దమందడి మండలం, అల్వాల గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షాల పిడుగుల కారణం చేత గ్రామ శివారులో ఉన్న గౌనికాడి బుడ్డన్న యాదవ్, టంకరి రమేష్ యాదవ్ ల దాదాపు 55 గొర్రెలకు మరణం సంభవించింది, విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘ వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి, ఆదిత్య రెడ్డి సంఘట న స్థలానీ చేరుకొని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుండి మీకు ఎటువంటి సహాయం కావాలని చిన్నారెడ్డి బాధితులను అడగగా మాకు డబ్బులు అవసరం లేదని తిరిగి అదే సంఖ్యలో ప్రభుత్వం నుంచి గొర్రెలను ఇప్పించాలని బాధితులు కోరారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ గతంలో ఎలాంటి సందర్భంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి స్కీమైన ఉంటే దాని ద్వారా లేదా బ్యాంకు నుంచి 50% వరకు రుణం ఇప్పించి మీకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం కలెక్టర్ తో కలిసి బాధితులకు వీలైనంత త్వరలో నష్ట పరిహారం కింద 55 గొర్రెలను ఇప్పించి తీరుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ సోషల్ మీడియా యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ జి.నరేష్ కుమార్ రెడ్డి, అల్వాల గ్రామ కాంగ్రెస్ నాయకుడు లక్ష్మి కాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పెంటన్న యాదవ్, పెద్దమందడి విష్ణువర్ధన్ రెడ్డి, ఐ. సత్య రెడ్డి, రవీందర్ రెడ్డి, తదితరులు గ్రామవాసులున్నారు.


# బీడీ కార్మికుల కూలీ తగినంత పెంచకపోతే తీవ్రమైన పోరాటాలకు సిద్ధం కండి



ఆత్మకూర్, మే 07(తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్టియు)ఆధ్వర్యంలో మస్తిపురం, మూలమల్ల, అమరచింత బీడీ ఫ్యాక్టరీల దగ్గర ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు పి అరుణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు ఏ.సామ్యూల్, జిల్లా సహాయ కార్యదర్శి సి.రాజు మాట్లాడుతూ గత నెలల్లో రెండు దఫాలుగా జరిగిన చర్చల్లో బీడీ కార్మిక సంఘాలు పెట్టినా డిమాండ్ ను పక్కకు పెట్టి యాజమాన్యం అతి తక్కువ వేతనాలు పెంచుతామని ముందుకు రావడం శోచనీయం అన్నారు. రెండవ దఫా చర్చల్లో ప్రస్తుతం ఇస్తున్న 207 రూపాయల పైన పది రూపాయలు పెంచుతామని యాజమాన్యం ప్రకటించడం కార్మిక వర్గాన్ని అవమానించడమే కనుక కార్మికులు ఈ నెల తొమ్మిదవ తేదీన మూడోదాఫా చర్చల్లో తగినంత కూలీ పెంచకపోతే తీవ్రమైన పోరాటాలకు బీడీ కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లాలో 1000 బీడీకి 245- 75 పైసలు అమలైతున్న వాటిని కూడా పరిగణలోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. కార్మికులకు చట్టం ప్రకారం వేతనం అమలు చేయాలని, పిఎఫ్ లో యజమాని వాట 50% అమలు చేయాలని, గ్రాటివీటి చట్టం ప్రకారం చెల్లించాలని, పిఎఫ్ లో తప్పులను యాజమాన్యమే సరి చేయాలని తదితర డిమాండ్ల సాధనకై భవిష్యత్తులో కార్మిక వర్గం సంఘటితంగా ఐక్యంగా బలమైన పోరాటాలకి పూనుకుంటామని బీడీ యాజమాన్యానికి హెచ్చరిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్, సామ్సన్ లక్ష్మి జనార్ధమ్మ, బాలన్న, తిరుపతమ్మ,, కృష్ణమ్మ, వెంకటమ్మ, చెన్నమ్మ ,భాగ్య, మరియమ్మ, కథల్, రాజు, చెన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.



# పెద్దమందడి మండలం లో పోటా పోటీ ప్రచారాలు





వనపర్తి ప్రతినిధి, మే 07(తీన్మార్ న్యూస్): జిల్లాలోని పెద్దమందడి మండల కేంద్రంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల కొరకై కాంగ్రెస్, బిజెపి పార్టీలు పోట పోటీగా ప్రచారాలు చేస్తున్నాయి. ప్రతి మంగళవారం పెద్దమందడి మండల కేంద్రంలో బస్టాండ్ దగ్గరలోని కూరగాయల సంత (మార్కెట్ యార్డు) ఆవరణలో ప్రచార వాహనాలు పెట్టి రానున్న పార్లమెంట్ ఎన్నికల మే 13న మా పార్టీ అంటే మా పార్టీకి ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. అయితే భారీ శబ్దాలతో రెండు వాహనాలు ఒకే దగ్గర ఉంచి ప్రసంగించడం వల్ల ప్రజలకు ఇబ్బందికరంగా మారుతుందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

# గెలుపే లక్ష్యంగా మూలమలలో జోరుగా బిఆర్ఎస్ ప్రచారం

**– ఉపాధి హామీ కూలీలతో బిఆర్ఎస్ ప్రచారం**

**– ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ**





ఆత్మకూర్, మే 07(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండలం, మూలమల గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మహబూబ్నగర్ పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మన్నే శ్రీనివాస్ రెడ్డి గెలుపు కృషికై గ్రామంలో జోరుగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో ప్రచారం చేపట్టారు. అనంతరం ఉపాధి కూలీలకు టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గడ్డం భీమన్న, కో ఆప్షన్ నెంబర్ షేక్ మహబూబ్ బాషా, యూత్ ప్రెసిడెంట్ ఎండి షరీఫ్, ఉపసర్పంచ్ రంగారెడ్డి, బీసీ సెల్ ప్రెసిడెంట్ ఎల్లప్ప, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బిపిఎల్ రాజు, మాజీ వార్డ్ సభ్యులు టీ.విజయ్ కుమార్, యువ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు గొర్రెల మృతి

**– పరమర్శించి అండగా ఉంటామని భరోసా**

**– పెద్దమందడి కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తూడి శ్రీనివాసరెడ్డి**



వనపర్తి ప్రతినిధి, మే 07(తీన్మార్ న్యూస్): పెద్దమందడి మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో సోమవారం అర్ధరాత్రి 2 గంటల సమయాన ఉరుములు మెరుపులతో కూడిన అకాల వర్షం లోని పిడుగుపాటుకు అల్వాల గ్రామా టంకరి రమేష్ కు చెందిన 20 గొర్రెలు, బుడ్డన్నకు చెందిన 35 గొర్రెలు మృత్యువాతకు గురయ్యాయి. విషయం తెలుసుకున్న పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తూడి శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు సంఘటన స్థలానికి చేరుకుని వారిని పరామర్శించారు. గ్రామానికి చెందిన రమేష్ బుడ్డన్నలు వారి గొర్రెల మందను ఒకే చోట ఆపారు. ఈ క్రమంలో రాత్రి పడ్డ పిడుగుపాటుకు దాదాపు ఆరున్నర లక్షల విలువ గల 55 గొర్రెలు మృతి చందాయని వారు బాధితుల ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల సమన్వయకర్త తూడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గొర్రెలు చనిపోయిన కుటుంబాలకు తాము అండగా ఉంటామని ప్రభుత్వం తరఫున రావలసిన సహాయ సహకారాలు అందజేసేందుకు కృషి చేస్తామని ఆయన బాధితులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి పెద్దమందడి టిజెఎస్ మండలం అధ్యక్షులు కుప్పిరెడ్డీ సాయికుమార్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, జగత్ పల్లి గట్టు యాదవ్, మంగంపల్లి వెంకట్రామ్ రెడ్డి, అల్వాల చంద్రశేఖర్ రెడ్డి, బాల్ రెడ్డి, కే.వెంకటేశ్వర్ రెడ్డి, చిన్నమందడి ఉప సర్పంచ్ డి శ్రీనివాసులు, రాఘవేంద్ర శెట్టి, మంగంపల్లి, హనుమంతు నాయక్, కొత్రపాటి సుదర్శన్, నరేందర్ గౌడ్, జి.వెంకటరామిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఎం.చంద్రశేఖర్ రెడ్డి, కే.వెంకటరెడ్డి, మైబూస్, రామకృష్ణారెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# వృద్ధురాలికి రక్తదానం




గోదావరిఖని, మే 07(తీన్మార్ న్యూస్): ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ నిమిత్తం జూపాక లక్ష్మి అను వృద్ధురాలికి బ్లడ్ అవసరం ఉండటం తో ఈ విషయం 31వ డివిజన్ బొద్దుల రాజు బిఆర్ఎస్ యువ నాయకుడు నమతాబాద్ కిరణ్ జి కి సమాచారం అందించడంతో వెంటనే స్పందించి, వారికి అవసరమైన ఏ గ్రూప్ బ్లేడ్ అవసరం ఉన్నదో తెలుసుకుని పార్టీ కార్యకర్త అయిన బిఆర్ఎస్ యువజన అధికార ప్రతినిధి బురుగు వంశి కృష్ణా ద్వారా రక్తం అందజేశారు. ఆసుపత్రిలో ఉన్న వారికి వెంటనే బ్లేడ్ అందజేయడం తి వైద్యులు ఆపరేషన్ ప్రారంబించారు. ఈ కార్యక్రమలో కిరణ్ జీ మాట్లాడుతూ అవసరం నిమిత్తం మేము సైతం అంటూ ఉన్నామని ఎవరికైనా ఏ అపద ఉన్న వెంటనే సంప్రదించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వెంకటేష్, మహేందర్, కనకరాజు, సందీప్ ముందుకు రావడం చాలా హర్షణీయం అని కొనియాడారు.

# కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డికే ఓటు వేయండి

## - ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ లో కాంగ్రెస్ నాయకులు ఇంటి ఇంటికి ప్రచారం

ఇబ్రహీంపట్నం, మే 07(తీన్మార్ న్యూస్): భువనగిరి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డికే ఓటు వేయాలని, కిరణ్ కుమార్ రెడ్డి గెలుపుతోనే దేశానికి మలుపు అని బ్రహీంపట్నం మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు అన్నారు. దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కావాలంటే భువనగిరి పార్లమెంట్ నుంచి కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 24 వ వార్డు లో కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోసం కాంగ్రెస్ నాయకులు ఇంటి ఇంటికి తిరిగి ప్రచారం చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ కిరణ్ కుమార్ రెడ్డి హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశంలో అభివృద్ధి మాటే లేకుండా పోయిందన్నారు. సంక్షేమ పథకాలు కనుమరుగయ్యాయన్నారు.కార్పొరేట్ శక్తుల కోసమే బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఈ యొక్క కార్యక్రమంలో జెర్కోని



బాల్‌రాజ్, జమాల్‌పూర్ శ్యామ్ లాల్, నగేష్, ఆనంద్ బాబు, మహమ్మద్ సోహెల్, యువజన కాంగ్రెస్ నాయకులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న బిజెపి ఇంటింటి ప్రచారం

ఆత్మకూర్, మే 07(తీన్మార్ న్యూస్): పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్నగర్ బిజెపి పార్టీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ.గెలుపే లక్ష్యంగా వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండలం, మూలమల్ల గ్రామంలో గ్రామ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో జోరుగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ బిజెపి పార్టీ అధ్యక్షులు పి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో బిజెపి పార్టీ 400 సీట్లు సాధిస్తుందని మళ్లీ పదేళ్లు నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారని మహబూబ్నగర్ పార్లమెంటు ఎంపీగా డీకే అరుణమ్మ విజయం సాధిస్తారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మూలమల గ్రామ బిజెపి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, భగవంతు రెడ్డి, యువ



నాయకులు ఉద్దుట్ల అశోక్, బూత్ అధ్యక్షులు వల్లూరి రవి, సైక అంజి, మునిస్వామి, పానుగంటి శివ, మల్ల శ్రీధర్, బోయ ప్రభాకర్, కే.శివ, తదితరులు పాల్గొన్నారు.

# కొండాపూర్ గ్రామం లో బి ఆర్ ఎస్ భారీ షాక్

## - పార్టీ మారిన మాజీ సర్పంచ్ మల్లేష్

తుర్కపల్లి, మే 07(తీన్మార్ న్యూస్): మండలంలోని కొండాపూర్ మాజి సర్పంచ్ దొంకేనా మల్లేష్ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కి ఆకర్షతులై బిఆర్ఎస్ పార్టీ ని వీడి సోమవారం సాయంత్రం జరిగిన కార్నర్ మీటింగ్ లో కాంగ్రెస్ పార్టీ లో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సమక్షంలో చేరారు. ఆయనతో పాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కే.నర్సింగ రావు, గొనె చంద్రం, సింగం శ్రీకాంత్, సింగం సురేందర్, శివరాత్రి నర్సింహులు, బర్ల పోషయ్య, తుటి సత్తయ్య, తూటి మహిపాల్, బర్ల ప్రవీణ్, తూటి మహేందర్, దుబ్బాక రాములు, దొంకేనా యాదయ్య, కొన్నే పండరి, దొంకేనా రమేష్, కర్ణాకర్, ఊరటి మల్లేష్, తూటి మహేష్, పాండు, నరేష్, కనకయ్య, బర్ల స్వామి లతో పాటు సుమారు 30 మంది తో చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఐలయ్య మాట్లాడుతూ రాష్టము లోనే కాదు కేంద్రం లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మెరుగైన అభివృద్ధి చేసుకోవచ్చని, భారీ



మెజారిటీ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలిపించాలని అన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయ సంకేతం ఎగరవేస్తాం

## - కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ





ఆత్మకూర్, మే 07(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలో 9వ వార్డులో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, మక్తల్ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మహబూబ్నగర్ బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా బలపరిచిన మన్నె శ్రీనివాస్ రెడ్డి గెలుపే లక్ష్యంగా మున్సిపల్ కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో జోరుగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. మే 13వ తేదీన జరగబోయే ఎన్నికల్లో బ్యాలెట్ నమూనాలో కారు గుర్తుకు ఓటేసి మన్నె శ్రీనివాస్ రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ విజయసంకేతం సాధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కుసుమ సీతారాం రెడ్డి మృతికి సంతాపం

## తెలిపిన మాజీ ఎమ్మెల్యే రంగనన్న

నేరేడుచర్ల, మే 07(తీన్మార్ న్యూస్): సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కుసుమ సీతారాంరెడ్డి( 72) అనారోగ్యంతో సోమవారం రాత్రి మరణించారు. ఆయన పార్థీవ దేహం పై సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఎర్రజెండా కప్పి విప్లవ జోహార్లు అర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాంరెడ్డి మొదటి నుండి సిపిఎం పార్టీలో ఉంటూ పత్తేపురం గ్రామంలో సిపిఎం పార్టీ అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సిరికొండ శ్రీను మండల కమిటీ సభ్యులు మర్రి నాగేశ్వరరావు, కట్ట మధుబాబు, మామిడి నాగ సైదులు, మచ్చ సోమయ్య, ఫతేపురం గ్రామ శాఖ కార్యదర్శి మడుపు దేవయ్య, అన్నపురెడ్డి రాం నరసింహారెడ్డి, ఆరే వెంకటయ్య, అలుగుబెల్లి నర్సిరెడ్డి,



మేకల సురేందర్ రెడ్డి, కొనుగంటి రామిరెడ్డి, కొప్పుల అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కంచుకోటలో పట్టు నిలిపేనా...?

మెదక్, మే 7: మెదక్ లోక్ సభ నియోజకవర్గంలో గత ఐదు ఎన్నికల్లలో ఓటమి ఎరుగని భారత రాష్ట్ర సమితికి, ఓటమి రుచి చూపించే శక్తి కాంగ్రెస్పార్టీకి, భారతీయ జనతా పార్టీకి ఉందా? అని విశ్లేషకులు లెక్కలు వేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ గత ఎన్నికల్లో కంటే ఇప్పుడు రాష్ట్రం మొత్తం మీద కొంత బలహీనంగా కనపడుతు న్నా, ఇప్పటికీ బీఆర్ఎస్ కు మెదక్ లోక్ సభ నియోజకవర్గ పరిధి ఒక కంచుకోటే అంటున్నారు. దాన్ని ప్రతిబింబిస్తూనే, గత అసెంబ్లీ ఎన్నికలలో ఈ లోక్ సభ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజక ర్గాలలో, ఆరు గెలుచుకుని తన పట్టు నిలుపుకుంది. అయితే, బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారం కోల్పోవడం, లోక్ సభ ఎన్నికల్లో కూడా ఆ పార్టీ విజయకాశాలకు పెద్ద విఘాతంగా మారింది. అయినా, ఇప్పటికీ మెదక్ లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పి.వెంకట్రామి రెడ్డి గెలవటానికి మంచి అవకాశాలే ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ విజయావకాశాలు దెబ్బ తీయటానికి సకల ప్రయత్నాలు చేస్తుంది. అన్ని నియోజకవర్గాలలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్న లీడర్లను, క్యాడరును తమ పార్టీలోకి ఆహ్వానిస్తుంది. మెదక్ లోక్ సభ పరిధిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, మాజీ నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి , భూమి రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆర్ సత్యనారాయణ వంటి బలమైన నాయకులు కాంగ్రెస్ పార్టీ లో చేరటం, బీఆర్ఎస్ పార్టీకి పెద్ద దెబ్బగానే చూస్తున్నారు

# అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాలలో తడిసి ముద్దయిన ధాన్యం







రాజాపేట, మే 07(తీన్మార్ న్యూస్): రాజాపేట మండలంలో మంగళవారం సాయంత్రం ఆకస్మిక ఈదురుగాలు తో భారీ వర్షంతో రాజపేట మండలంలోని పలు గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల ధాన్యం కుప్పలు తడిసి ముద్దయిపోయాయి. సుమారు గంటకు పైగా ఈదురు గాలుల ఉరుములో మెరుపులతో కూడిన వర్షం భారీగా పడడంతో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యం కుప్పలు నీటిలో తేలాడాయి. అందుబాటులో ఉన్న టార్పాలిన్ కవర్లను కొందరు రైతులు ధాన్యం కుప్పలపై వేయగా మరికొందరు రైతులు కళ్ళముందే తడిసిపోతున్న ధాన్యాన్ని చూసి ఆందోళన చెందారు. మండలంలో 17 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండగా అన్ని కేంద్రాలలో పరిస్థితి ఇలాగే ఉంది. ఈ విషయంపై రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

# దేశవ్యాప్తంగా యూసీసీ

న్యూఢిల్లీ, మే 7: దేశంలో ఉమ్మడి పౌరస్మృతి (జఅఅ)ని అమలుచేసిన తొలి రాష్ట్రం ఉత్తరాఖండ్ అని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి అన్నారు. దేశమంతా యూసీసీ అమలు కోసం ఎదురుచూస్తోందని.. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక దేశ వ్యాప్తంగా ఉమ్మడి పౌరస్మృతి అమలు చేసి తీరతామని స్పష్టం చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గం కసిష్ ఫంక్షన్ హాల్ లో యువమోర్చా సమ్మేళనంలో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పుష్కర్ సింగ్ దామి మాట్లాడుతూ.. ఉత్తరాఖండ్ దేవ భూమి అని, తమ పుణ్యభూమికి ఎవరైనా రావొచ్చు అని తెలుగు ప్రజలను ఆహ్వానించారు. ఈసారి ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు గెలుస్తుందని దీమా వ్యక్తం చేశారు. నేడు దేశమంతా మోదీ వైపు చూస్తోందన్నారు. మోదీకి సరిపోయే వ్యక్తి కోసం భూతద్దం చూసి వెతికినా దేశంలో ఎక్కడా కనిపించడం లేదన్నారు. యువశక్తి మన ప్రధాన బలం అని, మన యువతే మోదీ భవిష్యత్ భారత నిర్మాణంలో కీలకంగా మారనున్నారు. యువత పెద్ద సంఖ్యలో బీజేపీకి ఓట్లు వేసి తమ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రధాని మోదీ ఎజెండా అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో ఎక్కువ స్థానాలు గెలిచేది బీజేపీ అన్నారు. వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్ లలో బీజేపీ పెద్దలు ప్రచారం చేయగా, తాను సైతం తెలంగాణలో పలు కార్యక్రమాల్లో పాల్గొనట్లు చెప్పారు.

ఎటు చూసినా బీజేపీ, మోదీ వైపు ప్రజలు చూస్తున్నారని.. కేంద్రంలో వచ్చేది తమ ప్రభుత్వమే అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బీజేపీ హవా నడుస్తోందని, ఎ.ఔ.ఆ.ఎ.ం కూటమిలో ప్రధాని అయ్యే వ్యక్తి ఎవరూ లేరని పుష్కర్ సింగ్ ధామి కీలక వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీకి రాజకీయాలు సరిగ్గా అర్థం కావడం లేదని, ఆ పార్టీ నేతలకు ఏకాభిప్రాయం ఉండదన్నారు.యువత భవిష్యత్ కోసం, దేశ రక్షణ కోసం నరేంద్ర మోదీ మరోసారి ప్రధాని కావాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆకాంక్షించారు. దేశం కోసం తాను ప్రధానిగా ఉండాలని మోదీ భావిస్తే, తన కుటుంబం కోసం, తన కోసం ప్రధాని పదవి కోరుకుంటున్న వ్యక్తి రాహుల్ గాంధీ అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ లో జరగనున్న బీజేపీ భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున యువత తరలి రావాలని పిలుపునిచ్చారు కిషన్ రెడ్డి. ప్రధాని మోదీ సభకు తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. వయోజనులు అంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని, నరేంద్ర మోదీని మరోసారి ప్రధాని కావాలంటే బీజేపీకి ఓటేయాలన్నారు. దేశంలో శాంతి కొనసాగాలన్నా, ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలన్నా బీజేపీ మరోసారి అధికారంలోకి రావాలన్నారు.

# రాష్ట్రంలో పాలన లేదు... పగ, ప్రతీకారాలు కనిపిస్తున్నాయి

## హరీష్ రావు

హైదరాబాద్: హైదరాబాద్లో జరిగిన మీట్ ద ప్రెస్లో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడారు. 6 గ్యారంటీలను అమలు చేశాకే కాంగ్రెస్ ఎంపీ ఎన్నికల్లో ఓట్లు అడగాలి. కాంగ్రెస్ బాండు పేపర్ బౌన్స్ అయింది. అందుకు శిక్ష వేయాలని ప్రజలను నిర్ణయించారు. అప్పుడు ప్రామిస్లు ఇప్పుడు దేవుళ్లపై ప్రామిస్లు. హామీలు అమలు కావడడం లేదంటే చెప్పుతో కొట్టాలని దూషిస్తున్నారు. ఢిల్లీకి మూటలు పంపడంలో ఉన్న శ్రద్ధ హామీల అమలుపై పరిపాలనపై లేదు. రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ను, ఆయన సీనియారిటీని గౌరవించకుండా రేవంత్ కళ్లు పీకుతా, పేగులు మెడలో వేసుకుంటా అని దుర్భాషలాడుతున్నారు. కేసీఆర్ పరిపాలన వికేంద్రీకణ కోసం ఏర్పాటు చేసిన జిల్లాలను రద్దు చేస్తానంటున్నాడు. ఇది ముందుకు పోవడమా, వెనక్కి పోవడమా? రాష్ట్రంలో పరిపాలన లేదు, పగ ప్రతీకారాలు కనిపిస్తున్నాయి. ప్రజాపాలనలో 3 లక్షల యాభైవేల దరఖాస్తులు వచ్చాయి. ఎన్ని పరిష్కరించారో శ్వేతపత్రం విడుదల చేయాలి. ప్రతిపక్షాల గొంతు నొక్కడమే పనిగా పెట్టుకున్నాడు రేవంత్. మా సోషల్ మీడియా కార్యకర్తలను వేధిస్తున్నారు. పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకమని మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ వాటినే ప్రోత్సహిస్తోంది. 8 సీట్లలో బీజేపీ గెలిచేలా కాంగ్రెస్, 8 సీట్లలో కాంగ్రెస్ గెలిచేలా బీజేపీ ఒప్పందం చేశాయని అన్నారు. హైదరాబాద్ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని సమైక్యవాదులు అంటున్నారు. రేవంత్ రెడ్డికి ఆంధ్రా మూలాలున్నాయి. తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బీజేపీ, కాంగ్రెస్ లు రాజకీయ ప్రయోజనాల కోసం ఏడు మండలాలను ఏపీకి ఇచ్చాయి. తెలంగాణ ప్రయోజనాలను కాపాడుకోడానికి బీఆర్ఎస్ గెలవాలని ప్రజలు కోరుకుంటున్నారు. బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదు. దేశవ్యాప్తంగా 157 మెడికల్, నర్సింగ్ కాలేజీలు ఇస్తే రాష్ట్రానికి ఒక్కటి ఇవ్వలేదు. కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు, నవోదయ స్కూళ్లు ఇవ్వలేదు. డ్లు కొనాలంటే నూకలు తినండి అని కేంద్ర మంత్రులు అన్నారు. కేసీఆర్ తెలంగాణను దక్షిణ భారత ధాన్యాగారంగా మార్చితే వడ్లు కొనకుండా వివక్ష చూపారు. తెలంగాణకు ఏమీ ఇవ్వని బీజేపీ ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతుంది? ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులు, నిరుద్యోగులు,మహిళలు.. ఏ ఒక్క వర్గానికీ బీజేపీ మేలు చేయలేదు. కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, రైతులకు ఉచిత కరెంటు, మెడికల్ కాలేజీలు, కొత్త జిల్లాలు, కేసీఆర్ కింట్, మంచినీళ్లు, తాగు నీళ్లు ఇచ్చిండు. బీజేపీ ఏం చేసింది. ఆదానీని ప్రపంచ కుబేరుల్లో టాప్ టెన్లో నిలబెట్టింది. నల్లచట్టాలు తెచ్చి లాఠీచార్జి చేసి, బాష్పవాయువు ప్రయోగించి 700 మంది రైతులను పొట్టనబెట్టుకుంది. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తామని చెప్పి మోసం చేసింది. ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పారుగాని బిల్లు పెట్టలేదు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచి ప్రజలను ఇబ్బంది పెట్టింది. భక్తి ధార్మికం గురించి మాట్లాడుతున్నారు. కేసీఆర్ కంటే ధార్మికుడు మరొకరున్నారా? అద్భుతంగా యాదాద్రి కట్టింది కేసీఆర్. ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు కొరత రాకుండా చూశారు. ఆధ్యాత్మికంలో ఆయన బీజేపీకంటే రెండు అడుగులు ముందు ఉన్నారు. కేసీఆర్ బస్సుయాత్రకు ప్రజల్లో ఆదరణ లభిస్తోంది. పీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కంటే బీఆర్ఎస్కే ఎక్కువ వస్తాయి. నిశ్శబ్ద విప్లవం రాష్ట్రంలో వస్తుంది. రివర్స్ గేర్లో పోతున్న కాంగ్రెస్ నుంచి ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. రాష్ట్రం దివాలా తీసిందనే ముఖ్యమంత్రే చెబితే పెట్టుబులు వస్తాయా? రేవంత్ మాటల వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గింది. పరిశ్రమలు ఇబ్బందుల పడుతున్నారని అన్నారు.కేసీఆర్ హయాంలో నీళ్లు , కరెంటు పుష్కలంగా ఉండంతో ఇతర రాష్ట్రాల నుంచి పెట్టుబడులు వచ్చాయి. ఇప్పుడా పరిస్థితి లేదు. మీకు పాలన చేతకాక రాష్ట్రాన్నివెనక్కి తీసుకెళు న్నారు. గత ప్రభుత్వంపై బురదచల్లుతూ రాష్ట్రం పరువు తీస్తున్నారు. రేవంత్ బీజేపీలో చేరతారని అర్వింద్, మహేశ్వర్ రెడ్డి అంటున్నారు. దీన్ని రేవత్ ఎందుకు ఖండించడం లేదు. కవిత అరెస్ట్ కాలేదు కనుక బీజేపీ బీఆర్ఎస్ ఒకటని అబద్ధాలు చెప్పి మైనారిటీ ఓట్లు సంపాదించుకున్నారు. ఇప్పుడు కవిత అరెస్టయ్యారు, కుక్మక్కయితే ఎందుకు అరెస్ట్ అవుతారు. రేవంత్ మైనారిటీలను మోసం చేస్తున్నారు. కేబినెట్లో మైనారిటీని తీసుకోలేదు. రంజాన్ తోఫా నిలిపేశారు. ఇమామ్ వేతనాలు రావడం లేదు. రేవంత్ మోదీని బడే బాయ్ అంటూ ఆశీర్వాదాలు కోరుతున్నారు. బీఆర్ఎస్ అన్ని వర్గాల పార్టీ. మైనారిటీలకు అన్యాయం జరిగితే పోరాడుతుంది. హిందూ ముస్లింలను రెండు కళ్లా చూసే పార్టీ బీఆర్ఎస్. బీఆర్ఎస్ను ఆదరించాలని ముస్లింలను, క్రైస్తవులను ఇతర మైనారిటీలను కోరుతున్నా. కాంగ్రెస్ హామీలు అమలు కావాలంటే ప్రశ్నించే గొంతుకను గెలిపించాయి. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడం బీఆర్ఎస్ తోనే సాధ్యమని అన్నారు

# కరీంనగర్ లో ఫిర్యాదులతో హీటెక్కిన రాజకీయం

కరీంనగర్, మే 7: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాజకీయాలు వేడెక్కాయి. పోలింగ్ కు గడువు దగ్గరపడుతుండడంతో ముఖ్యనేతల సుడిగాలి పర్యటనలతో ప్రచారం ముమ్మరం చేశారు. నేతల మధ్య మాటల యుద్ధం సాగిస్తున్నారు. పరస్పరం విమర్శలు ఆరోపణలతో రాణా మెట్లు ఎక్కేవరకు చేరింది.కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్(రావుతోపాటు బిఆర్ఎస్ కు చెందిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి)పై కేసులు నమోదు అయ్యాయి. బిజేపి అభ్యర్థి బండి సంజయ్ పై ఇండిపెండెంట్ అభ్యర్థి మానస రెడ్డి పోలీసులకు పిర్యాదు చేశారు.కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు తన సొంత ఫేస్ బుక్ ఐడీ నుంచి బిజేపి ఎంపి అభ్యర్థి సంజయ్ కుమార్( ను నిందిస్తూ పరువు పోయేలా తప్పుడు ప్రచారం చేస్తున్నాడని అతని పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బిజేపికి చెందిన సీనియర్ నాయకులు కొట్టె మురళీకృష్ణ టూటౌ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.బండి సంజయ్ గ్యారెంటీలు కాదు మోసాలు.. ఆయనకు ఓటు వేస్తే మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతాడని హిందూ ముస్లిం పేరుతో మరో ఐదేళ్లు పబ్బం గడుపుతాడని సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి బండి సంజయ్ పై అసత్యపు ప్రచారం చేస్తు పార్టీ ప్రతిష్టలు దెబ్బతినేలా పోస్ట్ లు పెడుతున్న వెలిచాల రాజేందర్ రావుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదును స్వీకరించిన టూటౌన్ పోలీసులు ఐపీసీ 171ఈ, 505 (1) సెక్షన్ లు క్రింద కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సిఐ విజయ్ కుమార్ తెలిపారు.బిఆర్ఎస్ కు చెందిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఎమ్మెల్యే రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ఉన్న వీడియో ను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారని జమ్మికుంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మెలుగూరు సదయ్య పోలీసులకు పిర్యాదు చేశారు.ఏప్రిల్ 30న జమ్మికుంటకు సీఎం రేవంత్ రెడ్డి జనజాతరకు రాగ నాడు సుభీక్షం నేడు సంక్షోభం అంటు రైతు భీమా మహాలక్ష్మి దళితబంధు, రైతు భరోసా, అడబిడ్డలకు తులం బంగారం గురించి నిలదీయాలని వీడియో ద్వారా కోరుతు ప్రజల్ని రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో వైరల్ చేశారని పిర్యాదులో పెర్కొన్నారు. సదయ్య పిర్యాదు ను స్వీకరించిన పోలీసులు? ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై ఐపిసి 504,153ఏ సెక్షన్ ల క్రింద కేసు నమోదు చేసినట్లు సిఐ వి.రవి తెలిపారు.బిజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి కుల మత రాజకీయాలు చేస్తూ మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగిస్తున్నారని అతనిపై చర్యలు తీసుకోవాలని స్వతంత్ర అభ్యర్థి పేరాల మానసరెడ్డి ఈసికి ఫిర్యాదు చేశారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న బండి సంజయ్ ని ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మాట్లాడితే సంజయ్ పై కేసు నమోదు చేయడానికి వెనుకాడబోమని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు

# యువత ఎటు వైపు...?

వరంగల్, మే 7: పార్లమెంట్ ఎన్నికలలో ప్రచారం హోరెత్తుతోంది. మరో వారం రోజుల్లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. గెలుపు ధీమాతో ఉన్న పార్టీలు ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అయితే తెలంగాణ ఎన్నికలలో ప్రధానంగా యువకులు నిర్ణయాత్మక శక్తిగా ఎదగడం విశేసం. ఈ యువ ఓటర్ల చేతిలో కీలక నేతల భవిష్యత్ తేలనుంది. రాష్ట్రంలో మొత్తం 3 కోట్ల 30 లక్షల ఓటర్లు ఉంటే.. వారిలో 8 లక్షల కొత్తగా నమోదయిన యువ ఓటర్లు ఉన్నారు. దేశంలోనే రికార్డు స్థాయిలో 19.74 కోట్ల మంది యువ ఓటర్లు ఉన్నారు. ఇక తెలంగాణలో చూస్తే యువ (పురుష) ఓటర్లు 64 లక్షల 89 వేల 502 కాగా.. యువ (మహిళ) ఓటర్లు 63 లక్షల 93 వేల 703గా ఉన్నాయి. 18 నుంచి 39 ఏళ్ల వయసున్న వారు కోటి 28 లక్షల 83 వేల 205 మంది ఉన్నారు. ఇలా యువ ఓటర్లు ఎక్కువగా ఉన్నందున చాలా సెగ్మెంట్లలో అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం ఉంది. దీంతో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు యువమంత్రాన్ని జపిస్తున్నారు. యువ ఓటర్లతో మాట్లాడేందుకు యువ నాయకులను రంగంలోకి దించారు. ఇలా అన్ని పార్టీలు యువతను టార్గెట్ చేయగా.. వారు ఎటువైపు మొగ్గు చూపుతారో అని ఆసక్తిదాయ కంగా మారింది. ప్రధానంగా యువ ఓటర్లు తమకు ఉన్న సమస్య నిరుద్యోగం. నిరుద్యోగులను ఆదుకుంటాం, వాళ్లకి అవి చేస్తాం..ఇవి చేస్తాం అంటూ పనికిరాని హామీలనిస్తూ వాళ్లను ఇన్నళ్లూ వాడుకున్నారు రాజకీయ నేతలు. నిరుద్యోగ సమస్యపై చిత్తశుద్ధితో పనిచేసే లీడర్ కోసం యువ ఓటర్లు ఎదురుచూస్తున్నారు. తెలంగాణలో నిరుద్యోగుల సంఖ్య ఏటికేడూ పెరుగుతూనే ఉన్నది. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 37 లక్షల మంది నిరుద్యో గులు ఉన్నట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడ్డ అప్పటి బీఆర్ఎస్ పార్టీ నిరుద్యో గులను నిలువునా మోసం చేసింది. కేవలం ప్రకటనలకే పరిమితం అయిన ఉద్యోగాలను నమ్ముకుని నిరుద్యోగ యువత ఆగం అయిపోయింది. తెలంగాణ రాష్ట్రంలో 10 ఏళ్లలో లక్షకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని చెబుతున్న నాటి కేసీఆర్ ప్రభుత్వం చేసింది మాత్రం 46 వేలు మాత్రమే అని గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి ఏటా లక్షల మంది డిగ్రీలు పూర్తి చేసినప్పటికీ ఆ స్థాయిలో ఉద్యోగావకాశాలను ప్రభుత్వం కల్పించలేకపోయిందనే విమర్శలొ చ్చాయి అప్పట్లో. డిగ్రీలు పూర్తి చేసిన 33.90 లక్షలమంది వన్ టైం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ప్రభుత్వ వెబ్ సైట్ లోనే స్పష్టం చేసింది అప్పట్లో. ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన వారు సుమారు 3 లక్షలకు పైగా ఉన్నారని సమాచారం. ఒక్క ఏడాది కాలంలోనే రాష్ట్రంలో నిరుద్యోగ సగటు 2.2 శాతం పెరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలలోనే కాంగ్రెస్ యువ ఓటర్ల మద్దతును పొందింది. వేలాది ఖాళీల భర్తీకి గ్రూప్ -1, మెగా డీఎస్సీ నోటిఫికేషన్లు జారీ చేశామని, జూన్ లో ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మరో 50 వేల ఖాళీలకు నోటిఫికేషన్లు జారీ చేస్తామని హామీ ఇచ్చింది. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రిక్రూట్ మెంట్ డ్రైవ్ లు చేపట్టడంలో విఫలమైన గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై యువతలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీనికి తోడు 2022లో టీఎస్పీఎస్సీ గ్రూప్-1, ఇతర నియామక పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ కావడం, పరీక్షల రద్దు బీఆర్ఎస్ పై ఆగ్రహానికి మరింత ఆజ్యం పోశాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి తెలంగాణలో కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావడంలో యువత కీలక పాత్ర పోషించారు.అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా ప్రభుత్వ శాఖల్లో రెండు లక్షల ఖాళీలను భర్తీ చేస్తామని, యూపీఎస్సీ తరహాలో 2025 నుంచి వార్షిక జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, టీఎస్పీఎస్సీ బోర్డును ప్రక్షాళన లాంటి హామీలతో కాంగ్రెస్ యువ ఓటర్ల మద్దతును పొందింది. ఇక కాంగ్రెస్ 'యువరోషిణి' కార్యక్రమం కింద స్టార్టప్ లకు రూ.5,000 కోట్ల కార్పస్ ను కేటాయించాలని ప్రతిపాదించింది. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కూడా యువ ఓటర్లను ఆకట్టుకోవడానికి కసరత్తులు చేస్తున్నాయి. జాబ్ క్యాలెండర్, ఇతర నిరుద్యోగ సమస్యలపై ఫోకస్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. కానీ బీఆర్ఎస్, బీజేపీలు పదేళ్ల కాలంలో నిరుద్యోగు లను మోసం చేశాయనే భావనలో ఉన్నారు యువ ఓటర్లు. అధిక శాతం యువ ఓటర్లు కాంగ్రెస్ విధానాల పట్ల సంతృప్తిగా ఉన్నారని రాజకీయ పండితులు భావిస్తున్నారు.

# మే మండిపోతుందా...!?

## 123 ఏళ్ల తర్వాత టెంపరేచర్

హైదరాబాద్, మే 7 : ఈ ప్రాంతం, ఆ ప్రాంతం అని తేడా లేదు. ఎండలు బీభత్సంగా కొడుతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. ఇవాల్టితో పోల్చితే నిన్నే నయం అని అనుకోవాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఏప్రిల్ నెలలో జమ్మూ కాశ్మీర్ నుంచి మొదలు పెడితే మేఘాలయ వరకు రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో బయటికి రావాలంటేనే ప్రజలు వణికి పోతున్నారు. ఏప్రిల్ నెల అలా ఉందంటే.. మే లో సూర్యుడు జనాలకు చుక్కలు చూపిస్తున్నాడు. ఉదయం 9 దాటితే చాలు రోడ్లమీద అనధికార కర్ఫ్యూ వాతావరణం నెలకొం టోంది. ఇక దేశవ్యాప్తంగా వడ దెబ్బకు జనం పిట్టల్లా రాలిపోతున్నారు. మే నెల ప్రారంభమై శుక్రవారం నాటికి మూడు రోజులు. ఈ మూడు రోజుల్లోనూ ఎండలు రికార్డు స్థాయిలో దంచి కొట్టాయి. అయితే వచ్చే రోజుల్లోనూ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరుగుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.ఈ ఏడాది ఏప్రిల్ నెలలో విపరీతంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే ఇలా నమోదు కావడం ఇది రెండవ సారట. 1901 సంవత్సరంలో ఏప్రిల్ నెలలో తొలిసారిగా ఇదే స్థాయిలో దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయట. వాస్తవానికి ఏప్రిల్ నెలలో వడగాలులు వీచడం అనేది ఉండదు. మే ప్రథమార్థం లేదా ద్వితీయార్థంలో వడగాలులు వీచడం పరిపాటి. కానీ ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే వడగాలులు విపరీతంగా వీచాయి.. ఇక ప్రస్తుత మే నెలలో కూడా విపరీతంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయట. వడగాలు లు వీస్తాయట. దేశవ్యాప్తంగా 11 రోజులపాటు హీట్ వేవ్స్ కొనసాగు తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. " ఏప్రిల్ ఐదు నుంచి ఏడు వరకు, 15 నుంచి 30 వరకు అధిక ఉష్ణోగ్రతలు, వడగాలు నమోదయ్యాయి. సగటు ఉష్ణోగ్రత 31 డిగ్రీల సెల్సియస్ గా నమోదయింది.. ఈశాన్య భారత దేశంలో సగటు కనిష్ట ఉష్ణోగ్రత 28.12 డిగ్రీల సెల్సియస్ గా నమోదయింది.. 1901 తర్వాత మళ్లీ ఈ స్థాయిలో ఏప్రిల్ నెలలో ఉష్ణోగ్రతలు నమోదవడం ఇదే తొలిసారి. 1980 నుంచి దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలోసాధారణం కంటే ఎక్కువ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాజస్థాన్ లోని దక్షిణ ప్రాంతం, మధ్యప్రదేశ్లోని పశ్చిమ ప్రాంతం, మహారాష్ట్రలోని విదర్భ, మరాఠవాడ, గుజరాత్ లోని ఖచ్ ప్రాంతంలో 8 నుంచి 11 రోజుల పాటు వేడి గాలులు వీస్తాయని"భారత వాతావరణ విభాగం డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మోహపాత్ర పేర్కొన్నారు.ఇక రాజస్థాన్ లోని తూర్పు, దక్షిణ ప్రాంతం, తూర్పు మధ్యప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ, చండీగఢ్, హర్యానా, చత్తీస్ గడ్, ఉత్తర ప్రదేశ్, ఒడిశాలోని మారుమూల ప్రాంతా లు, పశ్చిమ బెంగాల్లోని గంగానది పరివాహక ప్రాంతం, జార్ఖండ్, కర్ణాటక లోని ఉత్తర ప్రాంతంలోని మారుమూల ప్రదేశాలు, బీహార్, తెలంగాణ లోని కొన్ని ప్రాంతాలలో వేడిగాలులు, రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయట. అక్కడక్కడ గాలి దుమారాలతో కూడా వర్షాలు కురిసే అవకాశం కూడా ఉందట. అందువల్ల జనం అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఎండలు దంచి కొడుతున్న నేపథ్యంలో సాధ్యమైనంత వరకు ఉదయం లేదా సాయంత్రం సమయంలో పనులు పూర్తి చేసుకోవాలని చెబుతున్నారు.

# మరింత తగ్గనున్న రిజర్వేషన్ చార్జీలు

హైదరాబాద్, మే 7: వేసవి వేళ దూర ప్రయాణం చేసే ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ శుభవార్త చెప్పింది. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం రిజర్వేషన్ చార్జీలకు మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఓ ప్రకటనలో తెలిపారు.ఎనిమిది రోజుల ముందు ముందస్తు రిజర్వేషన్ చేసుకునే వారికి మాత్రమే ఈ మినహాయింపు వర్తిస్తుందని ఎండీ సజ్జనార్ స్పష్టం చేశారు. టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం ష్ట్రబిబిజూ:/ /బిబతీబిఇనీనిశ్రీతినివ.తిని వెబ్ సైట్ ని సంప్రదించాలని సూచించారు. ఈ రాంుుతీని వినియోగించుకోవాలని ప్రయాణికులకు కోరారు.ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్-విజయవాడ రూట్ లో వెళ్లే ప్రయాణికుల కోసం ప్రతి 10 నిమిషాలకో బస్సును అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మార్గంలో ప్రతిరోజు 120కి పైగా బస్సులను సంస్థ నడుపుతున్నట్లు తెలిపింది.ఇందులో లహరి ఏసీ స్లీపర్ 2, నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్ 2, ఈ-గరుడ 10, గరుడ ప్లస్ 9, రాజధాని 41, సూపర్ లగ్జరీ 62 బస్సులున్నాయని సంస్థ ఎండీ సజ్జనార్ వివరించారు. ఈ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ చేసుకునే వారికి 10 శాతం రాయితీని సంస్థ కల్పిస్తోందని సజ్జనార్ వెల్లడించారు. తిరుగుప్రయాణ టికెట్ పై ఈ డిస్కౌంట్ వర్తిస్తుందన్నారు.బెంగళూరుకు వెళ్లే ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే తిరుగు ప్రయణంపై 10 శాతం రాయితీని టీఎస్ఆర్టీసీ కల్పిస్తోంది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లే అన్ని హైఎండ్ సర్వీసుల్లోనూ ఈ రాయితీ వర్తిస్తుంది. ఈ రూట్లలో వెళ్లే ప్రయాణికులు ఈ 10 శాతం రాయితీని వినియోగించుకోవచ్చు. శ్రీశైలానికి ప్రత్యేక బస్సులను ప్రకటించింది తెలంగాణ ఆర్టీసీ. భక్తుల సౌకర్యార్థం శ్రీశైల పుణ్యక్షేత్రానికి సరికొత్త రాజధాని ఏసీ బస్సులను నడుపుతోందని తెలిపింది. హైదరాబాద్ నుంచి ప్రతి గంటకో బస్సును భక్తులకు అందుబాటులో ఉంచినట్లు ఎండీ సజ్జనార్ తెలిపారు.ఈ బస్సుల్లో జేబీఎస్ నుంచి రూ.524, నుంచి రూ.564 టికెట్ ధర ఉందని తెలిపారు. అత్యాధునిక హంగులతో ఘాట్ రోడ్డుకు తగ్గట్టుగా ఈ రాజధాని ఏసీ బస్సులను ప్రత్యేకంగా సంస్థ తయారు చేయించామని తెలిపారు. వేసవిలో చల్లదనం అందించే ఈ బస్సులను వినియోగించుకుని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకోవాలని సంస్థ కోరుతుందని పేర్కొన్నారు. ఈ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం ష్ట్రబిబిజూ://బిబతీబిఇనీనిశ్రీతినివ.తిని వెబ్ సైట్ ని సంప్రదించవచ్చని సూచించారు.ఆవకాయ పచ్చడి ప్రియులకు తెలంగాణ ఆర్టీసీ గుడ్ న్యూస్ చెప్పింది. రుచికరమైన అమ్మమ్మ చేతి ఆవకాయ పచ్చడిని మీ బంధువులు, స్నేహితులకు ద్వారా సులువుగా పంపించుకోవచ్చని తెలిపింది. మీ సమీపంలోని టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్ల ద్వారా ఆవకాయ పచ్చడిని బంధుమిత్రులకు చేరవేసే సదుపాయాన్ని సంస్థ కల్పిస్తోందని ఎండీ సజ్జనార్ ఇటీవలే తెలిపారు. తెలంగాణతో పాటు టీఎస్ఆర్టీసీ బస్సు సర్వీసులు తిరిగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర లకు ఆవకాయ పచ్చడిని సంస్థ డెలివరీ చేస్తోంది. పూర్తి వివరాలకు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ ఫోన్ నంబర్లైన 040-23450033, 040-69440000, 040-69440069 ను సంప్రదించాలని సూచించారు.

# నిర్మాతకు టోకరా

## నిందితుడికోసం గాలింపు

హైదరాబాద్: సినిమాలో ఒక్క చాన్స్'.. అంటూ వచ్చిన ఓ యువకుడు నిర్మాతకు టోకరా వేసి బంగారు ఆభరణాలు, నగదుతో ఉడాయించాడు. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకృష్ణానగర్లో నివాసముంటున్న టంగుటూరి ఎల్లలుబాబు భావేశ్ ప్రొడక్షన్స్ పేరుతో చిత్ర నిర్మాణ సంస్థ నడిపిస్తున్నాడు. గతేడాది సాయికుమార్ ప్రధాన పాత్రధారిగా 'నాతో నేను' అనే సినిమా తీశారు. ఇటీవల కొత్త సినిమాలో నటీనటుల కోసం చూస్తున్నారు. కాగా, శ్రీకాంత్ అనే యువకుడు ఇటీవల నిర్మాత ఎల్లలు బాబు వద్దకు వచ్చి.. సినిమాల్లో చాన్స్ ఇప్పించాలని కోరాడు. రెండుమూడు సార్లు ఆఫీసుకు రావడంతో త్వరలోనే ఆడిషన్స్ పెట్టిస్తానంటూ చెప్పారు. ఇదే క్రమంలో ఈ నెల 1న ఆడిషన్స్ కోసం రావాలంటూ చెప్పడంతో నిర్మాత బాబు వద్దకు వచ్చిన శ్రీకాంత్ రెండు గంటల పాటు తనలోని నటనా కౌశల్యాన్ని ప్రదర్శించాడు. తనకు ఒక్క చాన్స్ ఇస్తే మంచి నటుడిగా ఎదుగుతానంటూ నిర్మాతను మాటల్లో పెట్టాడు. మధ్యాహ్నం దాటడంతో పక్కనే ఉన్న రెస్టారెంట్కు వెళ్లి భోజనం తీసుకురావాలంటూ నిర్మాత బాబుకు సూచించాడు. శ్రీకాంత్ బయటకు వెళ్లి భోజనంతో పాటు మద్యం తీసుకువచ్చాడు. అభిమానంతో మద్యం తీసుకువచ్చానంటూ మాటల్లో పెట్టి విపరీతంగా తాగించాడు. మద్యం మత్తులో నిద్రలోకి జారుకున్న ఎల్లలు బాబు మెడలో ఉన్న 10 తులాల బంగారు గొలుసు, 3 ఉంగరాలు, ఖరీదైన రాడో వాచీతో పాటు సొరుగులో ఉన్న రూ.50వేల నగదును తస్కరించి ఆఫీసు బయట గడియ పెట్టి ఉడాయించాడు. రాత్రయ్యాక నిద్రలోంచి లేచి చూసుకోగా.తన బంగారంతో పాటు ఇతర వస్తువులు చోరీ అయినట్లు గుర్తించిన నిర్మాత బాబు తన కుమారుడికి ఫోన్ చేసి విషయాన్ని వివరించాడు. శుక్రవారం నిర్మాత బాబు కుమారుడు టంగుటూరి ప్రవీణ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ 420, 380 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు శ్రీకాంత్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

# చేవెళ్లలో ట్రయాంగ్యులర్ ఫైట్

హైదరాబాద్, మే 7: చేవెళ్ల రాజకీయాలు ఈసారి ఆసక్తికరంగా మారాయి. అక్కడ పోటీ చేయబోతున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు గతంలో బీఆర్ఎస్ నుంచి గెలిచినవారే. ఈసారి ఆ ఇద్దరు అభ్యర్థులనే ప్రత్యర్థులుగా ఎదుర్కోబోతుంది బీఆర్ఎస్. కాంగ్రెస్, బీజేపీ రెడ్లకు టికెట్లు ఇస్తే.. బీఆర్ఎస్ బీసీని బరిలోకి దించుతోంది.2014, 19 లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం నుంచి రెండుసార్లు బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచారు. 2014లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌పై గెలుపొందారు. 2019లో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన రంజిత్ రెడ్డి.. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిపై విజయం సాధించారు. మారిన రాజకీయ పరిణామాలతో కొండా విశ్వేశ్వర్ రెడ్డి బీజేపీలోకి వెళ్లగా, రంజిత్ రెడ్డి లేటెస్ట్‌గా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పుడు ఇద్దరు నేతలు కూడా ఆయా పార్టీల నుంచి అభ్యర్థులుగా రంగంలోకి దిగనున్నారు.ప్రస్తుతం జాతీయ పార్టీల నుంచి పోటీ చేస్తున్న మాజీ బీఆర్ఎస్ నేతలను ఎదుర్కొనేందుకు గులాబీ పార్టీ మూడోసారి కొత్త అభ్యర్థిని ఎంపిక చేసింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రాజకీయంగా గుర్తింపు ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్‌ను అభ్యర్థిగా ఖరారు చేసింది. బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ బీఆర్ఎస్ నేతలను ఎదుర్కొనేందుకు అనుగుణంగా వ్యూహాలను సిద్ధం చేసే పనిలో పడ్డారు.జిల్లాకు చెందిన సీనియర్ నేత మాజీమంత్రి సబిత ఇంద్రారెడ్డి నివాసంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. గతంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఆ ఇద్దరు నేతలను ఎదుర్కొనేందుకు వ్యూహ రచన రెడీ చేశారు. ప్రత్యర్థులుగా ఉన్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రంజిత్‌రెడ్డిని ఓడించి.. చేవెళ్ల ఎంపీ నియోజకవర్గంలో పార్టీకి ఉన్న పట్టును కొనసాగించాలని భావిస్తున్నారు బీఆర్ఎస్ నేతలు.చేవెళ్ల ఎంపీ నియోజకవర్గ పరిధిలోని.. శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం, చేవెళ్ల అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. గ్రామీణ ప్రాంతంలోని వికారాబాద్, తాండూర్, పరిగి నియోజకవర్గాల్లో హస్తం పార్టీ ఎమ్మెల్యేలు గెలుపొందారు. మెజారిటీ ఓటర్లు పట్టణ ప్రాంతంలోనే ఉండటంతో కచ్చితంగా తమకు కలసి వస్తుందని బీఆర్ఎస్ అంచనా వేస్తోంది. గతంలో బీఆర్ఎస్ అభ్యర్థులుగా పోటీ చేసిన ఇద్దరు నేతలు ఇప్పుడు ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తుండటం బీఆర్ఎస్ కు కాస్త ఇబ్బందికరంగా మారింది. కొంత క్యాడర్, లీడర్లు ఆ నేతలతో వెళ్లిపోయారు. ఇప్పుడున్న సొంత పార్టీ నేతలు సంపూర్ణంగా సహకరిస్తే తప్ప గెలుపు అంత ఈజీ కాదన్న అనుమానాలు కూడా బీఆర్ఎస్ నేతల్లో వ్యక్తం అవుతున్నాయి.కాంగ్రె?సను చేవెళ్లలో అసంతృప్తుల బెడద వెంటాడుతోంది. అభ్యర్థి ఎంపిక విషయంలో చివరి వరకూ తర్జనభర్జన లు పడిన కాంగ్రెస్ చివరకు బీఆర్ఎస్ సిటింగ్ ఎంపీ రంజిత్ రెడ్డిని తీసుకొచ్చి టికెట్ ఇచ్చింది. నిజానికి, ఆయన కంటే ముందే పార్టీలో చేరిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, ఆయన భార్య, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి చేవెళ్ల టికెట్ ఇస్తామని హామీ ఇచ్చింది.దీంతో ఆమె ప్రచారం కూడా మొదలుపెట్టారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్లాఆర్ తదితరులు కూడా ఈ సీటు ఆశించారు. కానీ, అనూహ్యంగా రంజిత్‌రెడ్డికి టికెట్ ఇచ్చి సునీతకు మల్కాజిగిరి కేటాయించారు. అయితే, రంజిత్ రెడ్డికి టికెట్ ఇవ్వడాన్ని కాంగ్రెస్ సీనియర్లు కొందరు ఇంకా జీర్ణించుకోవడం లేదు. అసంతృప్త నేతలను దారికి తెచ్చుకునే విషయంలో కాంగ్రెస్ నాయకత్వంతోపాటు రంజిత్ రెడ్డి కూడా ఇంకా పూర్తిస్థాయిలో సఫలం కాలేదు. ప్రచారంలో కొందరు అంటీముట్టనట్లు గానే వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల బహిరంగంగానే ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రశ్నించడం గమనార్హం. నిన్నమొన్నటి వరకు కాంగ్రెస్ కేడర్‌పై కేసులు పెట్టిన వారిని తీసుకొచ్చి ఇప్పుడు వారి తరఫున ప్రచారం చేయమంటే ఎలా చేస్తామని ప్రశ్నిస్తున్నారు. అసంతృప్త నేతలను పార్టీ నేతలు బుజ్జగించే యత్నాలు చేస్తున్నారు. చేరికలూ గందరగోళంగా మారాయి. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కాంగ్రెసలో చేరేందుకు సిద్ధమై వెనక్కి వెళ్లిపోయారు. పార్టీలో చేరాలనుకుంటున్న నాయకుల భవిష్యత్తుకు హామీ ఇచ్చేవారు.. పార్టీలోని సీనియర్లకు నచ్చచెప్పి భరోసా ఇచ్చేవారు లేకపోయారు. ఉమ్మడి జిల్లాలో కొంత పట్టున్న మహేందర్ రెడ్డి పూర్తిస్థాయిలో మల్కాజి గిరిపైనే దృష్టి కేంద్రీకరించారు.ఈ నేపథ్యంలోనే, నిన్నమొన్నటి వరకు చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడ గెలుపును సవాల్‌గా తీసుకుని పని చేస్తున్నారు. బీజేపీ తన అభ్యర్థిని ఎంతో ముందుగానే ప్రకటించింది! దాంతో, ఆ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అందరి కంటే ముందే ప్రచారం ప్రారంభించారు. తాజా రాజకీయ పరిస్థితులను తనకు అనుకూలంగా మలచుకుంటూ దూసుకుపోతున్నారు. నిజానికి, ఈ పార్లమెంటు పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో నాలుగు బీఆర్ఎస్, మూడు కాంగ్రెస్ గెలిచాయి.బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేదు. అప్పటి పరిస్థితులతో పోలిస్తే పూర్తి భిన్నమైన వాతావరణం ఇప్పుడు నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచిన కాషాయ పార్టీ ఇప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎసలకు సవాల్ విసురుతోంది. విశ్వేశ్వర్ రెడ్డి వ్యూహాత్మకంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.భారీ బహిరంగ సభలు కాకుండా క్షేత్రస్థాయికి వెళ్లి ఆయా వర్గాలతో వేర్వేరుగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.తనను ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గంలో ఏమేం చేస్తానో చెబుతూ 'చేవెళ్ల సంకల్ప పత్రాన్ని' విడుదల చేశారు. నియోజకవర్గవ్యాప్తంగా 3,700 కిలోమీటర్ల మేర తాను చేసిన ప్రజా ఆశీర్వాద యాత్రలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఇందులో సంకల్పం చెప్పుకొన్నారు.ప్రధాని మోదీ పేరునే ప్రధాన ప్రచారాస్త్రంగా మలచుకుని ఓట్లు అడుగుతున్నారు. ఆయన గెలుపు కోసం బీజేపీ కేడర్‌తోపాటు ఆ పార్టీ అనుబంధ సంస్థలు చాప కింద నీరులా పనిచేస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో పార్టీకి సానుకూల పరిస్థితులు ఉండడంతో గ్రామీణ ప్రాంతాలపై బీజేపీ ఎక్కువ ఫోకస్ పెడుతోంది. ఇక, విశ్వేశ్వర్ రెడ్డి భార్య, అపోలో ఆస్పత్రుల జేఎండీ సంగీతారెడ్డి కాలనీ అసోసియేషన్లు, మహిళా సంఘాలతో ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. ప్రచారంలోకి జాతీయ నాయకులను కూడా రంగంలోకి దింపాలని బీజేపీ నిర్ణయించింది. త్వరలో ప్రధాని మోదీ కూడా నియోజకవర్గంలో పర్యటించనున్నారు.చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో మూడు సెగ్మెంట్లు హైదరాబాద్‌లో అంతర్భాగంగా ఉండగా మిగతా నాలుగు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. వీటిలో దాదాపు 65 శాతం పట్టణ ఓటర్లే. వీరిలో అత్యధికులు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడినవారే. గెలుపోటములను శాసించే స్థితిలో ఉండడంతో వీరి ఓట్లు కీలకంగా మారాయి.సిటింగ్ సీటును కాపాడుకునేందుకు బీఆర్ఎస్ తంటాలు పడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో 4 సెగ్మెంట్లలో గెలవడమే కాకుండా లక్షకుపైగా ఓట్లను అధికంగా సాధించిన ఈ పార్టీ.. సిటింగ్ ఎంపీ రంజిత్ రెడ్డికే టికెట్ ఇచ్చిన తర్వాత ఆయన కాంగ్రెసలోకి వెళ్లిపోయారు. ఆయనతోపాటు కొంతమంది ముఖ్య నేతలు కూడా అదే బాట పట్టారు.బీసీల్లో కొంత పట్టున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను బీఆర్ఎస్ బరిలోకి దింపింది. తద్వారా ఇక్కడ బీసీ కార్డును ప్రయోగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో మంచి పట్టు ఉండడంతో సబితారెడ్డికి బాధ్యతలను అప్పగించారు.

# సివిల్స్ ర్యాంకర్లకు వెంకయ్య నాయుడు తో సత్కారం

హైదరాబాద్: 2023 యూపీఎస్సీ ఫలితాల్లో భాగంగా కేపీ 21బబి సెంచరీ ఐఏఎస్ అకాడెమి తమ అల్ ఇండియా ర్యాంకర్లతో? మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ సివిల్ సర్వెంట్స్, ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తారు. వివిధ భాషలు, వివిధ సంస్కృతులు ఉన్నాయి. మనకి రాజకీయ నేతల ఆధిపత్యం ఉండొచ్చు కానీ నిజానికి భగవద్గీతా, రాజ్యాంగమే ప్రధానం అని గుర్తుంచుకోవాలి. మీరు ప్రభుత్వానికి ప్రతురూపాలు, సీఎం, ఎమ్మెల్యే ఎంతో మంది ఉండొచ్చు కానీ మీ ధర్మం మీరు పాటించాలి అప్పుడే మీ పనితనం తెలుస్తుంది. ప్రకృతి మన జీవితం, ప్రకృతిని ప్రేమించాలి, ప్రకృతితో జీవించాలి. ఎవ్వరూ కూడా కన్న తల్లిని, జన్మ భూమిని, మాతృ భాషని మర్చిపోకూ దదు అలా మర్చిపోతే వాళ్లు మనీషులే కాదు. మీ అడుగులని మీరు అనుసరిస్తే విజయం మీదే అవుతుంది. ఎప్పుడైనా పాజిటివ్ గా ఉండాలి.

## రోజు కూలీగా మొగలయ్య

హైదరాబాద్, మే 7: పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్య రోజు కూలీగా మారారు. తుర్కయాంజల్‌లో ఓ ఇంటి వద్ద పని చేస్తున్న ఆయన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆయనకు ఆరు వందల గజాల ఇంటి స్థలంతో పాటు రూ. కోటి సాయం చేశారు. సీఎం కేసీఆర్ స్వయంగా రూ. కోటి చెక్కును అందించారు. అయితే అవి తన పిల్లల పెళ్లిళ్లతో పాటు స్థలం కొనుక్కోవడానికి సరిపోయాయనని .. డబ్బులు సరిపోకపోవడంతో కడుతున్న ఇంటిని కూడా మధ్యలో నిలిపివేశానని ఆయన తనను కలిసిన మీడియా ప్రతినిధులకు చెప్పారు. తన కుమారులకు అనారోగ్యం ఉందని అలాగే తనకు కూడా అనారోగ్యం ఉందని.. నెలకు మెడిసిన్స్ ఖర్చు రూ. ఏడు వేలు అవుతోందన్నారు. ప్రభుత్వం ఆయనకు ఆర్థిక సాయం ప్రకటించిన సమయంలోనే నెలకు రూ. పదివేల ప్రత్యేక పెన్షన్ మంజూరు చేసింది. ఆ పెన్షన్ సరిగా అందడం లేదని ఆయన చెబుతున్నారు. గత రెండు, మూడు నెలల నుంచి పెన్షన్ రావడం లేదని చెప్పారు. దర్శనం మొగులయ్య పరిస్థితిపై సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. ప్రభుత్వం పెన్షన్ ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నలు వచ్చాయి. మాజీ మంత్రి కేటీఆర్ కూడా స్పందించారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. తెలంగాణ ప్రభుత్వం కవులు, కళాకారులను ఎప్పుడూ గౌరవిస్తుంది. వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించి అత్యున్నతంగా గౌరవిస్తుందని ప్రకటించింది. గుస్సాడి కనకరాజు, దర్శన్ మొగిలయ్య తదితరులకు క్రమం తప్పకుండా పెన్షన్ చెల్లించిందని ఆధారాలను పోస్టు చేసింది. కొంత మంది గత ప్రభుత్వమే మొగులయ్యకు రూ.కోటి ఇస్తే ఇప్పుడు ఇలా కూలి పని చేస్తున్నట్లుగా మీడియాలో ప్రచారం చేయించుకుంటున్నారని.. రాజకీయ ఆయుధంగా మారుతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. రెండు రోజుల కిందటే మొగులయ్య సీఎం రేవంత్ ను క్యాంప్ ఆఫీసులో కలిశారు. ఆ ఫోటోలను కూడా మీడియాకు విడుదల చేశారు. తెలంగాణకు ప్రసిద్ధమైన కిన్నెర కళాకారుడిగా మొగులయ్యకు ప్రత్యేక గుర్తింపు ఉంది. భీమ్లా నాయక్ సినిమాలో ఆయనతో పాట కూడా పాడించారు. ఆ సమయంలో పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా రూ. రెండు లక్షలు సాయం చేశారు. అలాగే పలువురు ఇతరులు కూడా ఆయనకు సాయం చేశారు.

## సంజయ్ కామెంట్స్ తో మరింత కలవరం

హైదరాబాద్, మే 7: తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ఇటీవల కాస్త మందగించినట్లు కనిపిస్తోంది. మొన్నటి వరకు ఈకేసు విచారణలో దూకుడు ప్రదర్శించిన సిట్.. ఇప్పుడు వెనకాముందు ఆలోచిస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు ఈ కేసులో జైల్లో ఉన్న పోలీసు అధికారులకు బెయిల్ ఇవ్వడానికి కోర్టు నిరాకరించింది. ఈ క్రమంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కీలక ఆధారాలు బయటపెట్టారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన సూత్రదాని కేసీఆర్ అని రాధాకిషన్‌రావు అంగీకరించారని బండి సంజయ్ వెల్లడించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు పలుమార్లు చెప్పినట్లు తెలిపారు. అయినా పోలీసులు కేసీఆర్‌కు నోటీసులు కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. తన మాటలకు ఆధారం కూడా చూపించారు. ఈమేరకు కన్ఫెషన్ రిపోర్టును ఆయన మీడియా ముందు ఉంచారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. ఆ రిపోర్టును పరిశీలిసేత రాధాకిషన్‌రావు అప్రూవర్‌గా మారినట్లు తెలుస్తోంది. అంత వివరంగా కేసీఆర్ గురించిం.. కేసీఆర్ కోసం ఏం చేశామో చెప్పినా, తనపాత్రపై రాధాకిషన్‌రావు అంగీకరించినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.మొన్నటి వరకు ట్యాపింగ్ కేసులో దూకుడు ప్రదర్శించిన పోలీసులు ఇప్పుడు పట్టించుకోకపోవడం, రాధాకిషన్‌రావు విచారణలో కేసీఆర్ పేరు బయట పెట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కాంప్రమైజ్ అయ్యారా అన్న సందేహాలను బీజేపీ నేతలే వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ వ్యహారంలో కేసీఆర్‌ను కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ మంత్రి కాపాడుతున్నారని బండి సంజయ్ ఆరోపించారు.ఇక ట్యాపింగ్ బాధితుల్లో మొదట రేవంత్ అయితే.. తర్వాత తానేనని బండి సంజయ్ తెలిపారు. తర్వాత హరీశ్‌రావు కూడా బాధితుడే అని పేర్కొన్నారు. అందుకే అతనికి ఏడాది పాటు మంత్రి పదవి ఇవ్వలేదని వెల్లడించారు. ఈ కేసు నుంచి కేసీఆర్‌ను కాపాడేందుకు చాలా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.కేసీఆర్‌ను కాపాడేందకు తెర వెనుక జరుగుతున్న ప్రయత్నాలను బండి సంజయ్ అడ్డుకుంటారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అందుకోసమే ఆయన కన్ఫెషన్ రిపోట్టు బయట పెట్టారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు బండికి సీఎం రేవంత్ నుంచి కూడా సహకారం అందుతున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే కీలక డాక్యుమెంట్లు బయటకు వచ్చాయని ప్రచారం జరుగుతోంది. కేసీఆర్‌ను కాపాడే ప్రయత్నాలకు చెక్ పెట్టడానికి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల తర్వాత ఈ కేసులో సంచలన పరిణామాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు.

## కేటీఆర్ షాక్ ఇచ్చిన మహిళా రైతు

సిరిసిల్ల: సిరిసిల్ల లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చేస్తుండగా కేటీఆర్ ను బోనాల లక్ష్మి అనే మహిళ రైతు ప్రశ్నించింది. సిరిసిల్ల పరిధిలో పెద్దూరు శివారు ప్రాంతంలో మెడికల్ కళాశాల కొరకు తీసుకున్న వ్యవసాయ భూములను తిరిగి తమకు అప్పగించాలని కేటీఆర్ ని నిలదీసిన మహిళా రైతు.డబుల్ బెడ్ రూమ్ ఇస్తా అన్నవ్ ఇంకెప్పుడు ఇస్తావ్. మా భూములు తీసుకున్నారు, మేము రందికి సచ్చి పోతున్నాం అంటూ మహిళ అనగానే రంది పడకండి..కలెక్టర్ తో మాట్లాడి తిరిగి మీ జాగా తిరిగి ఇప్పించే బాధ్యత, ఫ్లాట్ కూడా వచ్చేలా చూస్తానని టెన్షన్ పడద్దని చెబుతుండగానే ఇంకెన్నడు ఇప్పిస్తారు అంటూ నిలదీసింది. మా మార్కెట్ లో సౌలతులు సక్కగా లేవు, దొంగలు, లంగాలు వస్తున్నారు..మమ్మల్ని బెదిస్తున్నారు అంటూ కేటీఆర్ కి చెప్పింది. ఏం రంది పడకండి నేను అన్ని చూసుకుంటా అని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

# పెద్దపల్లిలో పాగా వేసేది ఎవరు...?

కరీంనగర్: పెద్దపల్లిలో రాజకీయంగా అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ కంచుకోటలో పాగా వేసేందుకు బిఆర్ఎస్, బీజేపి ప్రయత్నిస్తున్నాయి. సిట్టింగ్ ఎంపీకి చెక్ పెట్టి కొత్త అభ్యర్థిని గులాబీ దళపతి కేసీఆర్ బరిలోకి దింపగా, కాంగ్రెస్ ఆర్థికంగా బలమైన వ్యక్తిని, బిజెపి సామాజికంగా అంశాన్ని పరిగణలోకి తీసుకుని సరికొత్త అభ్యర్థిని పోటీలో పెట్టింది.ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలతో పాటు 42 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. కాంగ్రెస్ నుంచి గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బిజేపీ నుంచి గోమాస శ్రీనివాస్ పోటీలో ఉన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ కు కంచుకోటగా ఉన్న పెద్దపల్లి... తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక టిఆర్ఎస్ కు అడ్డగా మారింది.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కేంద్రంలో బిజేపి, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా సిట్టింగ్ స్థానం బిఆర్ఎస్ ది కావడం.. ఈసారి ఎక్కువ మంది పోటీ చేస్తుండడంతో ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే చర్చ సాగుతుంది. ఎత్తుకు పైఎత్తులతో దూకుడు పెంచిన మూడు ప్రధాన పార్టీలు గెలుపే లక్ష్యంగా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి.వెలుగులు విరజిమ్మే ఎన్టీపీసీ, సిరుల మాగాణి సింగరేణి తో ముడిపడి ఉన్న పెద్దపల్లి పార్లమెంట్ పాలిటిక్స్ హాట్ టాపిక్ గా మారాయి. ఎస్సీ రిజర్వుడు స్థానమైన పెద్దపల్లిలో పార్లమెంట్ ఎన్నికల రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. నాలుగు జిల్లాల్లో విస్తరించిన పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం సెంటర్ అట్రాక్షన్ గా నిలుస్తుంది.పెద్దపల్లి, జగిత్యాల, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో ఏర్పడిన ఈ పార్లమెంట్ నియోజకవర్గం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరుగగా 9 సార్లు కాంగ్రెస్, మూడుసార్లు టిడిపి, రెండు సార్లు టిఆర్ఎస్ ఒకసారి తెలంగాణ ప్రజాసమితి గెలిచాయి. కానీ బిజేపి మాత్రం ఒక్కసారి కూడా గెలువలేదు. కనీసం రెండో స్థానానికి సైతం రాలేదు.బీజేపీకి ప్రాతినిధ్యం లేని నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈసారి ట్రై యాంగిల్ ఫైట్ జరుగుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బిఆర్ఎస్ మూడు పార్టీలు ఎవరికి వారే గెలుపు ధీమా వ్యక్తం చేస్తూ కధన రంగంలోకి దుకారు. గెలుపే లక్ష్యంగా అధికార, విపక్ష పార్టీలు పావులు కదుపుతున్నాయి.సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు బిఆర్ఎస్ కసరత్తు చేస్తుండగా, అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్ ఎంపీ స్థానాన్ని చేజిక్కించుకునేలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుంది. ఇక బిజెపి? మోడీ నామా జపంతో సత్తా చాటుకునేందుకు యత్నిస్తుంది. మూడు ప్రధాన పార్టీలు ఎత్తుకు పైఎత్తులతో కొత్త ముఖాలను, సరికొత్త అభ్యర్థులను తెరపైకి తెచ్చి సత్తా చాటే పనిలో నిమగ్నమయ్యాయి.మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బిజెపి(ఃఏఖ), బిఆర్ఎస్ శక్తియుక్తులను ప్రదర్శిస్తున్నాయి. పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 15 లక్షల 92 వేల 996 మంది ఓటర్లు ఉన్నారు. అందులో మహిళలు 805755 మంది కాగా పురుష ఓటర్లు 787140 మంది, ట్రాన్స్ జెండర్స్ 101 మంది ఓటర్లు ఉన్నారు.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ ఏడింటిని కైవసం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 12 లక్షల 25 వేల 768 ఓట్లు పోల్ కాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కు 6 లక్షల 82 వేల ఓట్లు రాగా బిఆర్ఎస్ కు 3 లక్షల 74 ఓట్లు లభించాయి. బిజెపికి కేవలం 79 వేల ఓట్లు మాత్రమే లభించాయి.అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్లు చూస్తే బిఆర్ఎస్ కంటే కాంగ్రెస్ కు మూడు లక్షల ఏడు వేల 670 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. సిట్టింగ్ ఎంపీగా ఉన్న బిఆర్ఎస్ నేత వెంకటేష్ కు 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 4 లక్షల 41 వేల 321 ఓట్లు దక్కాయి. నాలుగున్నరేళ్ల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ కంటే కాంగ్రెస్ కు 3 లక్షల ఏడు వేల ఓట్లు ఎక్కువ వచ్చాయి. ఓట్ల శాతాన్ని చూసి ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కే అనుకూల ఫలితం వస్తుందని భావిస్తున్నారు.పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 1989, 1991, 1996 లో వరసగా మూడుసార్లు కాంగ్రెస్ నుంచి జి వెంకటస్వామి ఎంపీగా గెలుపొందారు. 1998, 1999 లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన సుగుణకుమారి చేతిలో వెంకటస్వామి ఓటమిపాలయ్యారు. తిరిగి వెంకటస్వామి 2004లో కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. 2009 వెంకటస్వామి రాజకీయ రిటైర్మెంట్ తీసుకొని కుమారుడు వివేక్ వెంకటస్వామి బరిలోకి దింపగా 2009లో వివేక్ కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచి పార్లమెంటులో తొలిసారి అడుగు పెట్టారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో వివేక్, టిఆర్ఎస్ నుంచి పోటీ చేసిన బాల్క సుమన్ చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2019లో వివేక్ పోటీ చేయలేకపోయారు. ఆ సమయంలో టిఆర్ఎస్ నుంచి వెంకటేష్ నేత, కాంగ్రెస్ నుంచి ఆగం చంద్రశేఖర్, బిజెపి నుంచి ఎస్.కుమార్ పోటీ చేయగా 95 వేల ఓట్ల మెజార్టీతో వెంకటేష్ నేత గెలుపొందారుప్రస్తుతం మూడు ప్రధాన పార్టీలు తక్కువే కాదన్నట్లు వ్యవహరించడంతో తాజా రాజకీయాలు రక్తికట్టిస్తున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం సాగుతుంది. విమర్శలు.. ఆరోపణలు.. సవాళ్ళు ప్రతిసవాళ్ళతో ప్రజల్ని ఆకర్షించేందుకు కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ పోటీ పడుతున్నాయి. పోటీలో 42 మంది అభ్యర్థులు ఉన్నప్పటికి ప్రధానంగా పోటీ మాత్రం కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్యనే కొనసాగుతుందిపెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి ప్రస్తుతం ఎంపీ గా వెంకటేష్ నేత కొనసాగుతున్నారు. గత 2019 ఎన్నికల్లో బిఆర్ఎస్ నుంచి గెలిచిన వెంకటేష్ నేత గత రెండు మాసాల క్రితం బిఆర్ఎస్ టిక్కెట్ లభించదని భావించి కారు దిగి కాంగ్రెస్ లో చేరారు. కానీ చివరకు టిక్కెట్ లభించకపోవడంతో నామినేషన్ల చివరి రోజు కాంగ్రెస్ కు సైతం గుడ్ బై చెప్పి బిజేపిలో చేరాడు. అయన కథ అక్కడితో ముసిగిపోగా అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఒక్కటి కూడా గెలుచుకోలేక పోయినా సిట్టింగ్ ఎంపీ స్థానాన్ని కాపాడుకునేందుకు బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపీ కి చెక్ పెట్టి మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ను బరిలోకి దింపారు.ఇక కాంగ్రెస్ కు కంచుకోటైన పెద్దపల్లి లో పూర్వవైభవాన్ని చాటుకునేందుకు ఆ పార్టీ యత్నిస్తుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి, మంథని, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి ఏడు అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది.అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసిన కాంగ్రెస్? పార్లమెంట్ స్థానాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఆర్థికంగా సామాజికంగా బలమైన అభ్యర్థి కోసం అన్వేషించి మాజీఎంపీ స్వర్గీయ వెంకటస్వామి తనయుడు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కుమారుడు గడ్డం వంశీకృష్ణను బరిలోకి దింపింది. ఇప్పటికి వరకు 15 సార్లు ఎన్నికలు జరుగగా అందులో 9 సార్లు కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. అందులో వెంకటస్వామి నాలుగు సార్లు, ఆయన కుమారుడు వివేక్ ఒకసారి ఎన్నికయ్యారు. వంశీ తండ్రీ వివేక్ చెన్నూరు నుంచి, పెద్దనాన్న వినోద్ బెల్లంపల్లి నుంచి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. మంథని నుంచి మంత్రి శ్రీధర్ బాబు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్ చార్జిగా వ్యవహరిస్తున్నారు.ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సైతం ఈసారి పార్లమెంటు ఎన్నికల్లో తమ సత్తాను చాటుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తుంది. ఆ పార్టీ నుంచి నేతకాని సామాజిక వర్గానికి చెందిన గోమాస శ్రీనివాస్ ను పోటీలో నిలిపింది. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సామాజిక పరంగా నేతకాని ఓట్లు ఎక్కువగా ఉండడంతో వ్యూహాత్మకంగా బిజెపి ఎన్నికల ముందు శ్రీనివాస్ ను కాంగ్రెస్ నుంచి బిజేపిలో చేర్చుకుని టిక్కెట్ ఇచ్చింది. టిక్కెట్ ఇచ్చిన తర్వాత శ్రీనివాస్ ప్రచారం చేయకపోవడంతో అభ్యర్థిని మార్చుతారనే ప్రచారం జరగడంతో కాంగ్రెస్ నుంచి టిక్కెట్ ఆశించి భంగపడ్డ సిట్టింగ్ ఎంపి వెంకటేష్ నేత బిజేపిలో చేరేందుకు యత్నించారు.

# లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం గతంతో పోలిస్తే తక్కువగా నమోదు

## – ఏవరికి లాభం .. రాజకీయవర్గాల్లో చర్చ

న్యూ ఢిల్లీ మే 7: దేశంలో ఇప్పటిదాకా రెండు దఫాలుగా జరిగిన సార్వత్రిక లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం గతంతో పోలిస్తే తక్కువగా నమోదు కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. 2019 ఎన్నికలతో పోలిస్తే ముగిసిన 189 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల శాతం 3 నుంచి 4 శాతం దాకా తగ్గింది. తొలి విడతలో 101 నియోజక వర్గాలకు పోలింగ్ జరిగితే ప్రస్తుత ఎన్నికల్లో 66.14 శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. 2019లో ఇవే నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల్లో 70 శాతం దాకా ఓటర్లు ఓట్లు వేశారు. రెండో దశలో కూడా ఇదే ఓటింగ్ తీరు కనిపించింది. ఇటీవల ముగిసిన రెండో దశలో 88 నియోజక వర్గాలకు ఎన్నికలు జరిగితే ప్రస్తుతం 66.71 శాతం ఓటర్లు ఓట్లు వేస్తే గడిచిన ఎన్నికల్లో ఓటర్లు ఇక్కడ 70 శాతం దాకా ఓట్లు వేశారు. మొత్తం 2019తో ప్రస్తుత పోలింగ్ శాతాన్ని పోలిస్తే 3.5 నుంచి 4 దాకా పోలింగ్ శాతం పడిపోయింది. దీనితో దేశవ్యాప్తంగా తగ్గిన ఓటింగ్ శాతం ఎవరికి మోదం, ఎవరికి ఖేదం అనే విషయమై పార్టీల్లో, పరిశీలకుల్లో భిన్న రీతుల్లో చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి రెండు దశల ఎన్నికలే ముగిశాయి. ఇంకా ఐదు దశల్లో ఎన్నికలు జరగాలి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 70 శాతం పైగా ఓట్లు పడినప్పుడు బిజెపి 302 లోక్‌సభ సీట్లతో ఘన విజయం సాధించింది. ఈ దఫా ఓటింగ్ శాతం తగ్గడంతో ఓటర్ల నిరాసక్తత నెగటివ్ ఓటును సూచిస్తుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతుండగా, ఓటింగ్ తగ్గినా , పెరిగినా తమదే మూడోసారి విజయమని బిజెపి వర్గాలు చెబుతున్నాయి.

ఓటింగ్ శాతం తగ్గడానికి మండే ఎండలే కారణమని ఎన్నికల సంఘం వర్గాలు చెబుతున్నాయి. మొదటి రెండు దశల ఎన్నికల్లో ఎండలు 44 డిగ్రీల ఫారెన్ హీట్‌కు పరిమితమైతే మే నెలలో ఇంకా ఎండలు విజృంభించే అవకాశముంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎండలు మే నెలలో 50 డిగ్రీలకు చేరినా ఆశ్చర్యం లేదని చెబుతున్నది. మండే ఎండలు, వీచే వడగాడ్పులు ప్రజలను ఇంటికే నిర్బంధం చేస్తున్నాయి. అలాంటి పరిస్థితిలో మునుముందు జరుగబోయే ఎన్నికల్లో ఓటింగ్ శాతం ఇంకా పడిపోయే అవకాశాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తగ్గిన ఓటింగ్ శాతం ఎవరికి లాభిస్తుందనేది తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై గతంలో ఎన్నికల ఫలితాలు, సెఫాలజిస్టుల అంచనాలపై చర్చలు సాగుతున్నాయి. అయితే ఖచ్చితంగా ఓటింగ్ తక్కువైతే, ఎక్కువైతే అధికార పక్షానికి, విపక్షానికి లాభం జరుగుతుందనే శాస్త్రీయ అంచనాలు అయితే లేవు. ఎవరికి అనుకూలంగా వారు ఓటర్ టర్నవుట్‌ను మలుచుకుని జోస్యాలు చెబుతున్నారు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగబోయే ఈ ఎన్నికల్లో అధికార ఎన్‌డిఎ, కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి హోరాహోరీగా పోరాడుతున్నాయి. తగ్గిన ఓటింగ్ అంటే ఓటర్లలో ఉదాసీనత కనిపిస్తున్నదని, ఇది ప్రభుత్వ వ్యతిరేక ఓటు అని కాంగ్రెస్ చెబుతుండగా ఎండల కారణంగానే ఓటింగ్ శాతం తగ్గింది తప్ప మరొక కారణం కాదని ఎన్‌డిఎ వర్గాలు చెబుతున్నాయి. ఓటింగ్‌లో ఎందరు పాల్గొన్నా అదంతా తమకు అనుకూల ఓటని ఎన్‌డిఎ వర్గాలు చెబుతున్నాయి. 1952 నుంచి ఎన్నికల ఓట్ల శాతం, వివిధ పార్టీల గెలుపోటములను విశ్లేషిస్తే తక్కువ లేదా ఎక్కువ ఓట్లు పడితే అధికార లేదా విపక్షానికి విజయం తథ్యమనే విధంగా ఫలితాలు కనిపించడం లేదు. ఎన్నికల సెఫాలజిస్టులు మాత్రం తగ్గిన ఓటింగ్ శాతం అధికార పార్టీలకు వ్యతిరేకంగా మారే అవకాశాలే ఎక్కువని చెబుతున్నారు. దీనితో ప్రధానంగా పోటీ పడే రెండు ప్రధాన కూటముల్లో తక్కువ ఓటింగ్ భయాందోళనలు నెలకొన్నాయి. అయినా రెండు కూటములు తమదే విజయమంటూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించడం విశేషంగా చెప్పవచ్చు. దీనిపై వాదోపవాదాలు ఎలా వున్నా 50 డిగ్రీలకు పైగా వాతావరణం పెరిగితే ప్రజలు బయటికి వచ్చి క్యూలో నిలబడే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ప్రస్తుతం ఓటింగ్ సమయం ఉదయం 7 గం. నుంచి సాయంత్రం 5 గం. దాకా ఉంది. ఉదయం 8 దాటితే ఎండలు ప్రజలను వణికిస్తున్నాయి. దీనికి తోడు వడగాడ్పులు అనేక మంది ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. మరోవైపు కరంటు కోతలు ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కల్పించే అవకాశాలున్నాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో ఎన్నికలు జరిపి ఇప్పుడు ఓటింగ్ శాతం తగ్గిందనో, పెరిగిందనో చర్చించడం సరైనది కాదని రాజకీయ పండితులు అంటున్నారు. తెలంగాణలో ఎన్నికల సంఘం కాస్త జాగ్రత్త పడి పోలింగ్ సమయాన్ని 6 గం. దాకా పొడిగించమని అడగడం, కేంద్ర ఎన్నికల సంఘం అంగీకరించడం సరైన నిర్ణయమనే చెప్పక తప్పదు.

# ఓజోన్‌పై ప్రభావం .. భూమిపై ఉష్ణోగ్రత మార్పులు వడగాలులు

న్యూ ఢిల్లీ మే 7: భూమిపై రోజురోజుకు అనేక మార్పులు సంభవిస్తున్నాయి. మన దేశం సమశీతోష్ణ పరిస్థితులకు అనుకూలంగా ఉంటుంది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో వాతావరణంలో అనేక మార్పులు కనిపిస్తున్నాయి. దానికి కారణం పర్యావరణ కాలుష్యం. భూమిపై వివిధ రకాల జీవులు, అవి ఏర్పరచుకునే సహజ నమూనాలు ప్రపంచ పర్యావరణంపై పని చేయడానికి సహాయపడతాయి. కలుషితమైన గాలి, నీరు, క్షీణించిన నేల, పట్టణ పెరుగుదల అన్నీ కూడా పర్యావరణంపై ప్రభావం చూపిస్తాయి. వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువులు, అతినీలలోహిత కిరణాలు, ఏరో సాల్స్, ఓజోన్లలో దీర్ఘకాలిక మార్పులను పర్యవేక్షించడం వలన వాతావరణ మార్పులు కనబడుతున్నాయి. వేడి, పొడి కారణంగా సంభవించే అడవి మంటలు, సముద్రపు ఆమ్లీకరణ, వేడెక్కడం వల్ల బ్లీచ్డ్ పగడాలు, తుఫానులు, సముద్ర మట్టం పెరుగుదల కారణంగా, తీరప్రాంత వరదలు, ఎడారి కారణంగా వాతావరణంలో మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీని ద్వారా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలో పెరుగుదల, అలాగే సముద్ర ఉష్ణోగ్రతలు ఎక్కువ లోతులలో పెరగడం, తరచుగా సముద్రపు వేడి తరంగాలు, పిహెచ్ విలువ తగ్గడం, సముద్రం వేడెక్కడం, మంచు పలకలు ధ్రువీకరణ చెందడం ఇవన్నీ కూడా పర్యావరణ మార్పుల వల్ల వస్తున్నాయి. రానున్న రోజులలో మన దేశం తీవ్రమైన వడగాడ్పులతో ఇబ్బంది పడుతుందని, వాతావరణ మార్పులపై వాతావరణ శాఖ నివేదిక గత సంవత్సరం ప్రభుత్వాన్ని హెచ్చరించింది. తాజా గా ప్రపంచ బ్యాంకు సైతం ఇదే విషయంపై అనేక ఆందోళనకర విషయాలను తెలిపింది.వేడిగాలుల వల్ల భారత దేశంలోని మండుటెండలతో జనం ఉక్కిరిబిక్కిరి గత సంవత్సరం దేశ రాజధాని ఢిల్లీలో ఏప్రిల్ నెలలో 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైతే ఈ సంవత్సరం ఎండాకాలంలో ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. మే నెలలో అయితే ఎండలు తీవ్రస్థాయికి చేరి వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే వడగా లులతో ప్రజలు అనేక ఇబ్బందులు పడి డీహైడ్రేషన్‌కు లోనై నీరసంగా, బలహీనంగా కనిపిస్తున్నారు. 1981-1990 మధ్య కాలంలో 413 రోజులు, 2011- 2020 మధ్య కాలంలో 600 రోజులు తీవ్ర వడగాల్పులు వీచాయని భారత పర్యావరణ విభాగం వెల్లడించింది. ప్రజల ఆయుష్షు తగ్గి, పెద్దసంఖ్యలో మరణాలు సంభవిస్తాయని తెలిపింది. గత సంవత్సరం దేశ రాజధాని ఢిల్లీలో ఏప్రిల్ నెలలో 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైతే ఈ సంవత్సరం ఎండాకాలంలో ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. మే నెలలో అయితే ఎండలు తీవ్రస్థాయికి చేరి వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే వడగాలులతో ప్రజలు అనేక ఇబ్బందులు పడి డీహైడ్రేషన్‌కు లోనై నీరసంగా, బలహీనంగా కనిపిస్తున్నారు. 1981-1990 మధ్య కాలంలో 413 రోజులు, 2011- 2020 మధ్య కాలంలో 600 రోజులు తీవ్ర వడగాల్పులు వీచాయని భారత పర్యావరణ విభాగం వెల్లడించింది. అనగా 1990 నుండి 2019లో భారత్‌లో వడగాల్పుల తీవ్రత 15% పెరిగినట్లు లాన్సెట్ నివేదిక తెలిపింది.ఈ విధంగా ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వడగాలులు వీచి వాటి ప్రభావం అనేక వాటిపై కనిపిస్తుంది. రైతులు, వివిధ కార్యాలయాల్లో సిబ్బంది పని చేయలేక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల భూమిపై ఉన్న జీవులపై కూడా ప్రభావం చూపుతుంది. కోళ్ల పెంపకం, గొర్రెలు, మేకల పెంపకం, చెరువు లో పెంచే చేపల పెంపకంలో అనుకున్న స్థాయిలో కన్నా దిగుబడి తగ్గుతుంది. ఇవేకాక పాలిచ్చే జంతువులైన ఆవులు, గేదెల్లో కూడా పాల దిగుబడి తగ్గుతుంది. ఉష్ణ తాపం రవాణా వ్యవస్థ పై కూడా ప్రభావం చూపి, ఆహార ధాన్యాల రేట్లు పెరిగి ప్రజలకు భారమవుతుంది. ఆహార ధాన్యాల నిలువల కోసం, వాటిని శీతలీకరణ గిడ్డంగుల్లో ఉంచడానికి, వాటిని చల్లపరచడానికి ఎసిలు, కూలర్లు, ఫ్యాన్లు అవసరమవుతాయి. తద్వారా కరెంటుబిల్లు కూడా అధికంగా వచ్చి నష్టపోయే అవకాశం వుంది. పర్యావరణంలో ఉష్ణోగ్రతల తగ్గుదల కోసం అనేక చర్యలు చేపట్టాలి. చెట్లను అధికంగా నాటడం, వాటిని రక్షించడం ద్వారా కొంతమేర ఉష్ణోగ్రతను అరికట్టవచ్చు.ఒక్కొక్క గృహానికి అనేక వాహనాలు వాడడం, ఎసి, రిఫ్రిజిరేటర్లు వాడడం వల్ల, మొబైల్‌లు వాడటం, వాటి టవర్ల నుండి వచ్చే రేడియేషన్ ద్వారా, ఫ్యాక్టరీల నుండి వెలువడే వ్యర్థాలను కాల్చడం ద్వారా, వాతావరణం కలుషితమై భూమి పై కార్బన్‌డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ ఎక్కువగా విడుదలై, ఓజోన్‌పై ప్రభావం చూపి, భూమిపై ఉష్ణోగ్రత, వడగాలులు పెరుగుతాయి. వీటిని అరికట్టడానికి ప్రత్యేక కార్యాచరణ, ప్రణాళికను రూపొందించి, క్షేత్రస్థాయిలో ప్రతిష్టంగా అమలు చేసినట్లయితే భూమిపై ఉష్ణతాపాన్ని అరికట్టవచ్చు. వేసవి కాలంలో ఉష్ణ తాపాన్ని, వడగాలు లను అధిగమించాలంటే వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే బయటికి వెళ్లాలి. అత్యవసర పరిస్థితుల్లో తప్ప మిగతా సమయంలో బయటకు వెళ్లకూడదు. బయటికి వెళ్లేటప్పుడు గొడుగు పట్టుకొని మరికొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అలాంటప్పుడే వడగాలుల నుండి మనల్ని మనం రక్షించుకోగలం. నీటిని నాలుగు నుండి ఐదు లీటర్ల వరకు ఎక్కువగా తాగాలి. ఎండ తాకిడికి ఏమైనా ఆరోగ్య సమస్యలు వస్తే డాక్టర్‌ను సంప్రదించి ఆయన సలహా మేరకు పలు జాగ్రత్తలు పాటించాలి.

# శతకబాదిన సూర్య

**- హైదరాబాద్‌పై ముంబయి గెలుపు**

**- హైదరాబాద్ 173/8, ముంబయి 174/3**



హైదరాబాద్: సూర్యకుమార్ యాదవ్ (102 నాటౌట్, 51 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. వాంఖడే స్లో పిచ్‌పై ఫటాఫట్ ఇన్నింగ్స్‌తో సన్‌రైజర్స్ బౌలర్లపై విరుచుకుపడిన సూర్యకుమార్ యాదవ్ ముంబయి ఇండియన్స్‌కు 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందించాడు. 174 పరుగుల ఛేదనలో సూర్యకు తోడుగా తిలక్ వర్మ (37 నాటౌట్, 32 బంతుల్లో 6 ఫోర్లు) సైతం రాణించగా 17.2 ఓవర్లలోనే ముంబయి లాంఛనం ముగించింది. రోహిత్ శర్మ (4), ఇషాన్ కిషన్ (9), నమన్ దిర్ (0) విఫలమయ్యారు. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (48, 30 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ పాట్ కమిన్స్ (35 నాటౌట్, 17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించగా 20 ఓవర్లలో 8 వికెట్లకు 173 పరుగులు చేసింది. వాంఖడే స్లో పిచ్‌పై ట్రావిశ్ హెడ్ (48), అభిషేక్ శర్మ (11) తొలి వికెట్‌కు 56 పరుగులు జోడించారు. పవర్‌ప్లేలో హెడ్ ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో వన్‌మ్యాన్ షో చూపించాడు. పవర్‌ప్లే తర్వాత సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌లో వేగం మందగించింది. మయాంక్ అగర్వాల్ (5), హెన్రిచ్ క్లాసెన్ (2), షాబాజ్ అహ్మద్ (10)లు విఫలమయ్యారు. నితీశ్ కుమార్ రెడ్డి (20), మార్కో జాన్సెన్ (17) మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేదు. 96/5తో ఉన్న సన్‌రైజర్స్ ఓ దశలో 173 పరుగులు చేస్తుందని ఎవరూ అనుకోలేదు. అబ్దుల్ సమద్ (3) సైతం నిరాశపరిచినా కెప్టెన్ పాట్ కమిన్స్ (35 నాటౌట్) డెత్ ఓవర్లలో విలువైన పరుగులు జోడించాడు.

# స్ప్రింటర్లు చలో పారిస్

**- మెన్స్, ఉమెన్స్ రిలే జట్ల అర్హత**




న్యూఢిల్లీ: భారత మెన్స్, ఉమెన్స్ 4400 రిలే పరుగు జట్లు 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. ప్రపంచ అథ్లెటిక్స్ రిలేలో మన అథ్లెట్లు మెరుపు ప్రదర్శనతో ఈ ఘనత సాధించారు. ఉమెన్స్ రిలే జట్టులో రూపల్, పూవమ్మ, జ్యోతిక, సుభాలు 3.29.35 సెకండ్లలో రేసు ముగించి రెండో స్థానంలో నిలిచారు. జమైకా 3.28.54తో అగ్రస్థానంలో నిలిచింది. మెన్స్ రిలే జట్టు అనాస్, మొహమ్మద్, రాజీవ్, జాకబ్‌లు 3.3.23 సెకండ్లలో రేసును పూర్తి చేశారు. హీట్స్‌లో యుఎస్‌ఏ (2.59.95) తర్వాతి స్థానంలో నిలిచిన భారత జట్టు ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ప్రతి హీట్స్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించాయి. జులై 26-ఆగస్టు 11 వరకు పారిస్ వేదికగా 2024 ఒలింపిక్స్ జరుగనున్న సంగతి తెలిసిందే.

# ఖతర్నాక్ కోల్‌కత

**- లక్నోపై 98 పరుగుల తేడాతో గెలుపు**

**- కోల్‌కత 235/6, లక్నో 137/10**



లక్నో : కోల్‌కత నైట్‌రైడర్స్ ఐపీఎల్ 17వ సీజన్ ప్లే ఆఫ్స్ బెర్త్‌కు చేరువైంది. ఆదివారం లక్నోలో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్‌పై 98 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. బ్యాట్‌తో, బంతితో తిరుగులేని ప్రదర్శన చేసిన కోల్‌కత నైట్‌రైడర్స్ సీజన్లో ఎనిమిదో విజయం నమోదు చేసింది. 236 పరుగుల రికార్డు ఛేదనలో లక్నో 16.1 ఓవర్లలో 137 పరుగులకే కుప్పకూలింది. మార్కస్ స్టోయినిస్ (36), కెఎల్ రాహుల్ (25) మినహా లక్నో బ్యాటర్లు అందరూ తేలిపోయారు. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కత నైట్‌రైడర్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 235 పరుగులు చేసింది. పించ్ హిట్టర్ సునీల్ నరైన్ (81, 39 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్స్‌లు) ధనాధన్ అర్ధ సెంచరీతో దంచికొట్టాడు. 27 బంతుల్లోనే అర్ధ సెంచరీ బాదిన సునీల్ నరైన్..నైట్‌రైడర్స్‌కు మరోసారి భారీ స్కోరు అందించాడు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (32, 14 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి అదిరే ఆరంభం అందించిన సునీల్ నరైన్.. యువ బ్యాటర్ రఘువంశీ (32, 26 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి సైతం కీలక భాగస్వామ్యం నమోదు చేశాడు. అంద్రీ రసెల్ (12), రింకూ సింగ్ (16) నిరాశపరిచినా.. శ్రేయస్ అయ్యర్ (23), రమన్‌దీప్ సింగ్ (25 నాటౌట్) మెరవటంతో కోల్‌కత 235 పరుగులు చేసింది. లక్నో పేసర్ నవీన్ ఉల్ హాక్ (3/49) ఆకట్టుకున్నాడు.

# చెన్నై సూపర్‌మచ్చి

**- పంజాబ్‌పై ఏకపక్ష విజయం**

**- రాణించిన జడేజా, తుషార్, సింగ్**

**- చెన్నై 167/9, పంజాబ్ 139/9**



చెన్నై సూపర్‌కింగ్స్ అదరహో. గత నాలుగు మ్యాచుల్లో మూడు పరాజయాలు చవిచూసిన సూపర్‌కింగ్స్ ధర్మశాలలో గెలుపు బాట పట్టింది. పంజాబ్ కింగ్స్‌ను చిత్తు చేసి ఏకపక్ష విజయం సాధించింది. 168 పరుగుల ఊరించే ఛేదనలో జడేజా, తుషార్, సిమ్రన్‌జిత్ మ్యాజిక్‌తో పంజాబ్ బ్యాటర్లు చేతులెత్తేశారు. చెన్నై సూపర్‌కింగ్స్ ఏడో విజయం ఖాతాలో వేసుకోగా.. పంజాబ్ కింగ్స్ ఏడో ఓటమిని మూటగట్టుకుంది.

నవతెలంగాణ-ధర్మశాల

రవీంద్ర జడేజా (43, 26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) (3/20) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మాయజాలం చేశాడు. జడేజా మ్యాజిక్‌తో పంజాబ్ కింగ్స్ చేతిలో వరుస ఐదు ఓటములకు చెన్నై సూపర్‌కింగ్స్ చెక్ పెట్టింది. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌ను చిత్తు చేసిన సూపర్‌కింగ్స్ 28 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో టాప్-4లోకి ప్రవేశించింది. 168 పరుగుల ఛేదనలో పంజాబ్ కింగ్స్ చతికిల పడింది. ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ (30, 23 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), శశాంక్ సింగ్ (27, 20 బంతుల్లో 4 ఫోర్లు) మినహా టాప్ ఆర్డర్ బ్యాటర్లు అందరూ విఫలమయ్యారు. జానీ బెయిర్‌స్టో (7), రొసో (0), కరన్ (7), జితేశ్ (0), ఆషుతోశ్ (3) విఫలమయ్యారు. చెన్నై బౌలర్లు జడేజా (3/20), తుషార్ (2/35), సిమ్రన్‌జిత్ సింగ్ (2/16) మెరవటంతో పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 139 పరుగులే చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 167 పరుగులు చేసింది. రవీంద్ర జడేజాకు తోడు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (32, 21 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), డార్లీ మిచెల్ (30, 19 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఎం.ఎస్ ధోని (0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. పంజాబ్ బౌలర్లలో హర్షల్ పటేల్ (3/24), రాహుల్ చాహర్ (3/23), అర్షదీప్ సింగ్ (2/42) రాణించారు.

జడేజా షో : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన సూపర్‌కింగ్స్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. అజింక్య రహానె (9) మరోసారి నిరాశపరిచాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (32), డార్లీ మిచెల్ (30) రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేశారు. పంజాబ్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేసినా క్రమం తప్పకుండా బౌండరీలు బాదారు. శివం దూబె (0), మొయిన్ అలీ (17) నిరాశపరచటంతో చెన్నై 101/5తో కష్టాల్లో కూరుకుంది. ఈ సమయంలో రవీంద్ర జడేజా (43) ఆదుకున్నాడు. మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో మెరిశాడు. మిచెల్ శాంట్నర్ (11), శార్దుల్ ఠాకూర్ (17) తోడుగా డెత్ ఓవర్లలో రాణించాడు. ఎం.ఎస్ ధోని (0) తొలి బంతికే నిష్క్రమించగా అభిమానులు నిరాశకు లోనయ్యారు. పంజాబ్ కింగ్స్ బౌలర్లు హర్షల్ పటేల్, రాహుల్ చాహర్, అర్షదీప్ సింగ్‌లు సూపర్‌కింగ్స్ బ్యాటర్లను సమర్థవంతంగా నిలువరించారు. చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 167 పరుగులే చేసింది.

# వరల్డ్‌కప్ గెలవాలంటే రోహిత్ శర్మ కీలకం: యువరాజ్ సింగ్

**- 2024 టీ20 వరల్డ్‌కప్ బ్రాండ్ అంబాసిడర్‌గా యువీ**

**- ప్రస్తుతం టోర్నమెంట్ ప్రచార కార్యక్రమాల్లో బిజీ**

**- ఈ సందర్భంలోనే టీమిండియా సారథిపై ప్రశంసలు**

**- క్రికెట్‌లో తనకు హిట్‌మ్యాన్ ఆప్తమిత్రుడన్న యువరాజ్**



భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ మరోసారి రోహిత్ శర్మపై తన అభిమానాన్ని చాటుకున్నాడు. 2024 టీ20 వరల్డ్‌కప్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న యువీ ప్రస్తుతం టోర్నమెంట్ ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నాడు. ఈ సందర్భంగా ఒక ఐసీసీ ఈవెంట్‌లో యువరాజ్ మాట్లాడుతూ.. భారత్ వరల్డ్‌కప్ నెగ్గాలంటే కెప్టెన్ రోహిత్ శర్మ కీలకం అని అన్నాడు. రోహిత్ తప్పనిసరిగా టీమిండియాకు టైటిల్ అందిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశాడు.

ఈ పొట్టి ప్రపంచకప్ కోసం ప్రకటించిన జట్టు కూడా బాగుందని, సారథిగా హిట్‌మ్యాన్ ముందుండి టీమ్‌ను నడిపిస్తాడని చెప్పుకొచ్చాడు. క్రికెట్‌లో తనకున్న అతి కొద్దిమంది స్నేహితుల్లో రోహిత్ ఒకడని తెలిపాడు. ఈ సందర్భంగా భారత కెప్టెన్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పాడు యువీ. యువరాజ్ ఇంకా మాట్లాడుతూ.. "ఒత్తిడి అధికంగా ఉండే పొట్టి వరల్డ్‌కప్‌లో సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకునే కెప్టెన్ అవసరం. మనకు సరిగ్గా అలాంటి కెప్టెనే ఉన్నాడు. ఎంత సక్సెస్ అయినా ఇప్పటికీ రోహిత్‌లో మార్పు లేదు. మైదానంలో ముందుండి నడిపిస్తాడు. బయట అందిరితో సరదాగా ఉంటాడు. క్రికెట్‌లో తను నాకు ఆప్తమిత్రుడు. గతేడాది స్వదేశంలో జరిగిన 50 ఓవర్ల ప్రపంచకప్ లో ఫైనల్ వరకు జట్టును తీసుకెళ్లాడు. ఐదు ఐపీఎల్ టైటిళ్లు గెలిచాడు. నాకు తెలిసి టీమిండియాకు రోహిత్ లాంటి మంచి కెప్టెన్ కావాలి" అని యువరాజ్ చెప్పుకొచ్చాడు.

# టీ20 వరల్డ్‌కప్ కోసం ఉగాండా స్క్వాడ్ ప్రకటన.. 43 ఏళ్ల ఆటగాడికి జట్టులో చోటు!

**వెస్టిండీస్, అమెరికా సంయుక్త ఆతిథ్యంలో ఐసీసీ టోర్నీ**

**పొట్టి ప్రపంచకప్ కోసం ఉగాండా ప్రకటించిన జట్టులో 43 ఏళ్ల ఫ్రాంక్ సుబుగాకు చోటు**

**ఈ మెగా టోర్నీలో తొలిసారి పాల్గొంటున్న ఉగాండా**





మరో 25 రోజుల్లో టీ20 వరల్డ్ కప్-2024 ప్రారంభం కానుంది. వెస్టిండీస్, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ ఐసీసీ టోర్నమెంట్‌కు సమయం దగ్గర పడుతుండడంతో ఇప్పటికే చాలా జట్లు తమ స్క్వాడ్లను ప్రకటించాయి. తాజాగా ఉగాండా కూడా 15 మందితో కూడిన తమ జట్టును ప్రకటించింది. ఈ సందర్భంగా అత్యంత పెద్ద వయసులో టీ20 ప్రపంచ కప్ లో ఆడబోతున్న ప్లేయర్‌గా ఉగాండా ఆఫ్ స్పిన్నర్ ఫ్రాంక్ సుబుగా నిలవనున్నాడు.

ఇక ఉగాండా తొలిసారి ఈ మెగా టోర్నీలో పాల్గొంటోంది. ఈ పొట్టి ప్రపంచకప్ కోసం ఉగాండా క్రికెట్ బోర్డు ప్రకటించిన జట్టులో 43 ఏళ్ల సుబుగాకు కూడా స్థానం దక్కడం విశేషం. బ్రయాన్ మసాబా సారథ్యంలో ఉగాండా బరిలోకి దిగనుంది. కాగా, ఆఫ్రికా క్వాలిఫయర్స్ రీజనల్‌లో ఫైనల్‌లో ఉగాండా రెండో స్థానంలో నిలిచింది. తద్వారా ప్రపంచ కప్కు అర్హత సాధించడం జరిగింది. గ్రూప్-సీలో ఉన్న ఈ జట్టు తన మొదటి మ్యాచ్‌ను జూన్ 3న ఆఫ్ఘనిస్థాన్‌తో తలపడనుంది.

ఉగాండా స్క్వాడ్: బ్రయాన్ మసాబా, కెన్నెత్ వైస్వా, రిజాత్ అలీ షా, ఫ్రాంక్ సుబుగా, దినేశ్ నక్రాని, రోజర్ ముకాసా, రోనక్ పటేల్, బిలాల్ హసున్, కోస్మాస్ క్యెవుటా, రాబిన్సన్ ఒబుయా, ఫ్రెడ్ అచెలమ్, హెన్నీ సెన్యోండో, సిమోన్ సెసాజి, జుమా మియాజి. అల్పేష్ రాజ్‌మణి.

# ఉగ్రవాదుల బెదిరింపు టి20 వరల్డ్ కప్ కు పటిష్టమైన భద్రత

**ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని కీల్ రౌలే**




ట్రినిడాడ్ : వచ్చే నెలలో జరిగే టి20 ప్రపంచకప్ టోర్నీకి ఉగ్రవాద ప్రమాదం పొంచి ఉందనే వార్తలపై నిర్వాహక దేశాల్లో ఒకటైన ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రభుత్వం స్పందించింది. మెగా టోర్నీలో ఉగ్రవాదులు దాడులకు పాల్పడే అవకాశాలున్నాయని వార్తలు వస్తున్నాయి. ఇవి నిర్వాహక దేశాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ వార్తలపై ఆతిథ్య దేశాలతో పాటు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) ప్రతినిధులు స్పందించారు. ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని కీత్ రౌలే మాట్లాడుతూ ప్రపంచకప్ వంటి మెగా టోర్నీకి ఉగ్రవాదుల నుంచి బెదిరింపులు రావడం బాధగా ఉందన్నారు.

21వ దశాబ్దంలోనూ ఉగ్రవాద ముప్పు పెరిగిపోవడం బాధాకరమన్నారు. విభిన్న మార్గాల్లో ఉగ్రవాదం వ్యాపిస్తుందని, ఇది ప్రపంచ శ్రేయస్సుకు మంచిది కాదన్నారు. ఉగ్రవాదంపై పోరాడేందుకు అన్ని దేశాలు సమాయత్తం కావాలని ప్రధాని సూచించారు. ప్రపంచంలోనే అతి పెద్ద క్రీడా సంగ్రామాల్లో ఒకటైన వరల్డ్‌కప్‌ను నిర్వహించే అవకాశం తమకు దక్కడం గర్వంగా ఉందన్నారు. అందివచ్చిన అవకాశాన్ని తాము సద్వినియోగం చేసుకుంటామని, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య మెగా టోర్నీని అత్యంత విజయవంతంగా నిర్వహిస్తామని ప్రధాని స్పంస్టం చేశారు. ప్రపంచకప్ ముగిసే వరకు మ్యాచ్‌లు జరిగే వేదికలు, పర్యాటక కేంద్రాల్లో భారీ భద్రతను ఏర్పాటు చేస్తామన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెగా టోర్నీని సాఫీగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. దీని కోసం ఇప్పటికే ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ సంస్థలు అహర్నిశలు కృషి చేస్తున్నాయన్నారు. ఇక వరల్డ్‌కప్‌లో పాల్గొనే ప్రతి ఆటగాడికి వ్యక్తగత భద్రతను కల్పిస్తామన్నారు. క్రికెటర్లు, సహాయక సిబ్బంది, కామంటేటర్లు, విశ్లేషకులు, అభిమానులకు పూర్తి భద్రత ఉంటుందన్నారు. అందరి సహకారంతో వరల్డ్‌కప్‌ను విజయవంతంగా నిర్వహిస్తామని ప్రధాని కీత్ రౌలే స్పష్టం చేశారు. మరోవైపు ఐసిసి కూడా వరల్డ్‌కప్‌ను ఎలాంటి అవరోధాలు లేకుండా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొంది. టోర్నీలో పాల్గొనే దేశాలు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా ఆడాలని కోరింది. ప్రతి క్రికెటర్‌కు పూర్తి భద్రత ఉంటుందని ఐసిసి అధికారులు హామీ ఇచ్చారు.

# సూర్యకుమార్ యాదవ్ ఖాతాలో ఐపీఎల్ రికార్డు

**- ముంబై ఇండియన్స్ లక్ష్య ఛేదనలో అత్యధిక పరుగులు చేసిన రెండవ ఆటగాడిగా నిలిచిన సూర్య**

**- 114 పరుగులతో సూర్య కంటే ముందున్న సనత్ జయసూర్య**

**- ముంబై తరపున రెండో అత్యధిక భాగస్వామ్యం నమోదుచేసిన సూర్య-తిలక్‌వర్మ**



ఐపీఎల్ -2024లో భాగంగా వాంఖడే స్టేడియం వేదికగా సోమవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ముంబై ఇండియన్ ఘనవిజయం సాధించింది. సూర్య కుమార్ యాదవ్ సెంచరీతో చెలరేగడంతో 174 పరుగుల లక్ష్యాన్ని ఆ జట్టు సునాయాసంగా ఛేదించింది. 51 బంతుల్లో 102 పరుగులు బాదిన సూర్య ముంబై గెలుపులో కీలక పాత్ర పోషించాడు. ఆరంభంలో నెమ్మదిగా బ్యాటింగ్ చేసిన సూర్య ఆ తర్వాత రెచ్చిపోయాడు. 12 ఫోర్లు, 6 సిక్సర్లతో హైదరాబాద్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తన ఐపీఎల్ కెరియర్‌లో రెండవ సెంచరీని నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో సూర్య ఒక ఐపీఎల్ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. లక్ష్య ఛేదనలో ముంబై ఇండియన్స్ తరపున అత్యధిక పరుగులు బాదిన ఆటగాడిగా సూర్య కుమార్ యాదవ్ నిలిచాడు. సన్‌రైజర్స్‌పై సూర్య కుమార్ యాదవ్ 102 పరుగులు కొట్టగా.. 114 పరుగులతో సనత్ జయసూర్య తొలి స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో లెండిల్ సిమన్స్, కామెరాన్ గ్రీన్‌లు సూర్య తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 **SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**